

విద్యతో ఉన్నత శిఖరాలు

ఎచ్చెర్ల : ప్రతి విద్యార్థి క్రమశిక్షణతో చదివి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని, నైపుణ్యాధారిత విద్యపై దృష్టిసారించాలని ఆర్‌జియుకెటి ఛాన్సలర్ కెసి రెడ్డి అన్నారు. ఎచ్చెర్ల ట్రిపుల్ ఐటిని గురువారం సందర్శించిన ఆయన పియుసి-1లో చేరిన విద్యార్థులతో మాట్లాడారు. ట్రిపుల్ ఐటిలో చదువుకునేందుకు ఎంపికైన విద్యార్థులంతా గ్రామీణ నేపథ్యం నుంచి వచ్చిన వారేనని, కష్టపడి చదవడం, తెలుసుకోవాలన్న ఆసక్తిని పెంపొందించుకోవడం, ఎటువంటి అనుమానాన్ని అయినా నివృత్తి చేసుకునేందుకు తరగతి అధ్యాపకులు, తోటి విద్యార్థులతో చర్చించడం అలవరచుకోవాలన్నారు. కార్యక్రమంలో డైరెక్టర్ జగదీశ్వరరావు, ఒఎస్‌డి సుధాకర్‌బాబు, పరిపాలన అధికారి మునిరామకృష్ణ, డీన్ మోహన్‌కృష్ణ చౌదరి, ఫైనాన్స్ ఆఫీసర్ చల్లా అసిరినాయుడు, గేదెల రవి తదితరులు పాల్గొన్నారు.

గ్రూప్-1 ఉద్యోగాల పంట

- పాత శ్రీకాకుళంలో ఒకే ఇంట్లో ఇద్దరు ఎంపిక
- డిఎస్‌పిగా ఎంపికైన టెక్కలి ఎక్సైజ్ ఎస్ఐ ప్రదీప్తి
- ఎసిటిఒగా రాజశేఖర్, రాకేష్

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి, ఆమదాలవలస, పొందూరు

గ్రూప్-1 ఫలితాల్లో జిల్లాకు చెందిన పలువురు యువతీ యువకులు విజయకేతనం ఎగురవేశారు. ప్రభుత్వం గురువారం వెలువరించిన ఫలితాల్లో ఉత్తమ మార్కులు పొంది ఉద్యోగాలను ఒడిసిపట్టుకున్నారు. జిల్లా అగ్నిమాపక అధికారి, అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ ట్యాక్సెస్, సబ్ ట్రెజరీ అధికారి, డిఎస్‌పి వంటి పోస్టులను సాధించారు. కొందరు ఇప్పటికే ఉద్యోగాలు చేస్తూ గ్రూప్-1కు ఎంపికయ్యారు. మరికొందరు గ్రూప్-1లో ఎంపికై సివిల్స్‌కు సాధన సాగిస్తున్నారు.

ఒకే ఇంట్లో ఇద్దరు ఎంపిక



మనోజ్



రాజేష్

శ్రీకాకుళంలో నివాసముంటున్న శిష్ట కరణం సంఘం రాష్ట్ర అధ్యక్షులు పోలు మహంతి ఉమామహేశ్వరరావు ఇద్దరు కుమారులూ గ్రూప్ - 1 ఉద్యోగాలకు ఎంపిక య్యారు. పెద్ద కుమారుడు పి.వి.ఎస్ రాజేష్ అగ్నిమాపకశాఖ అధికారిగా ఎంపికయ్యారు. చిన్న కుమారుడు మనోజ్ వైద్యారోగ్యశాఖలో అడ్మినిస్ట్రేటివ్ అధికారిగా ఎంపికయ్యారు. రాజేష్ హైదరాబాద్‌లోని గీతమ్‌లో బిటెక్ చదివారు. మనోజ్ బీహార్‌లోని ధన్‌బాద్‌లో ఇండియన్ స్కూల్ మైన్స్‌లో చదివారు. ప్రస్తుతం వీరిద్దరూ ఢిల్లీలోని వజీరామ్ అండ్ రవి కోచింగ్ సెంటర్‌లో సివిల్స్‌కు సాధన సాగిస్తున్నారు. తండ్రి ఉమామహేశ్వరరావు వసతిగృహ సంక్షేమ అధికారిగా ఉద్యోగ విరమణ చేయగా, తల్లి సాయి సుజాత ఆమదాలవలస మండలం తొగరాం జెడ్‌పి హైస్కూల్‌లో ఇంగ్లీష్ ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్నారు. ఇద్దరు కుమారులూ గ్రూప్-1 ఉద్యోగాలకు ఎంపిక కావడంపై వారి ఆనందానికి అవధులు లేకుండా పోయాయి. బంధువులు, స్నేహితులు ఫోన్లు చేసి అభినందనలతో ముంచెత్తుతున్నారు.

ఎసిటిఒగా రాజశేఖర్, రాకేష్



రాజశేఖర్



రాజేష్

ఆమదాలవలస మండలం తమ్మయ్యపేటకు చెందిన కోట రాజశేఖర్ సబ్ ట్రెజరీ అధికారిగా ఎంపికయ్యారు. మాజీ సర్పంచ్ కోట వెంకట రామారావు, సీతమ్మ ముగ్గురు కుమారుల్లో పెద్ద కుమారుడు రాజశేఖర్. ఒకటి నుంచి పదో తరగతి వరకు శ్రీకాకుళంలోని సెయింట్ జోసెఫ్ స్కూల్‌లో చదివారు. ఇంటర్మీడియట్ విశాఖపట్నంలోని ఒక ప్రయివేటు కళాశాలలో చదివారు. బిటెక్ చెన్నైలో, ఎంటెక్ ఢిల్లీ యూనివర్శిటీలో చేశారు. రాజశేఖర్ గ్రూప్-1కు ఎంపిక కావడంపై గ్రామస్తులు, బంధువులు, పలువురు అభినందనలు తెలియజేశారు.

పొందూరు మండలం కనిమెట్టకు చెందిన యువకుడు కూన రాకేష్ అసిస్టెంట్ కమిషనర్ ట్యాక్సెస్ ఉద్యోగానికి ఎంపికయ్యాడు. విశాఖపట్నం ఆంధ్రా యూనివర్శిటీలో బిటెక్ కంప్యూటర్ సైన్స్ చదివి గ్రూప్-1 పరీక్షకు ప్రత్యేక శిక్షణ పొందాడు. మొదటి ప్రయత్నంలోనే తన ప్రతిభతో గ్రూప్-1 ఉద్యోగానికి ఎంపికయ్యాడు. తండ్రి కె.వి.వి సత్యనారాయణ పొందూరు మండలం పిల్లలవలసలో ప్రధానోపాధ్యాయునిగా పనిచేస్తుండగా, తల్లి ధనలక్ష్మి గృహిణి. రాకేష్ గ్రూప్-1 ఉద్యోగానికి ఎంపిక కావడంపై కుటుంబసభ్యులు, గ్రామస్తులు, బంధువులు, స్నేహితులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

డిఎస్‌పిగా ప్రదీప్తి



ప్రదీప్తి

ఆమదాలవలస మండలం కొర్లకోటకు చెందిన పేడాడ ప్రదీప్తి గ్రూప్-1లో డిఎస్‌పిగా ఎంపికయ్యారు. ఈమె తల్లిదండ్రులు పేడాడ అప్పారావు, సుగుణ వేణి ఇద్దరూ ఉపాధ్యాయులుగా పనిచేస్తున్నారు. వీరి ప్రథమ కుమార్తె పేడాడ ప్రదీప్తి ప్రస్తుతం టెక్కలి డివిజన్‌లో ఎక్సైజ్ సబ్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్నారు. ఈమె ఒకటి నుంచి పదో తరగతి వరకు ఆమదాలవలస పట్టణంలోని విజ్ఞాన్ హైస్కూల్లో విద్యనభ్యసించారు. విశాఖపట్నం శ్రీచైతన్యలో ఇంటర్, గాయత్రి విద్యా పరిషత్‌లో బిటెక్ చదివారు. ఈమె చెల్లి పేడాడ ప్రతిభ ఇండియన్ ఆర్మీ విభాగంలో మేజర్‌గా ఐక్యరాజ్య సమితి తరుపున సూడాన్‌లో విధులు నిర్వహిస్తున్నారు. ప్రదీప్తి గ్రూప్-1లో ర్యాంకు సాధించడంపై గ్రామస్తులు, బంధువులు, స్నేహితులు పలువురు అభినందనలు తెలిపారు.



నిరసన చేపడుతున్న మున్సిపల్ కార్మికులు

మున్సిపల్ కార్మికుల సమస్యలపై నిర్లక్ష్యం

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్, ఇచ్ఛాపురం

మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు, మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎ.రమేష్ కుమార్ పట్నాయక్, ఎన్.బలరాం, ఉపాధ్యక్షులు ఎ.గణేష్ విమర్శించారు. మున్సిపల్ కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని, లేకుంటే ఈనెల 24వ తేదీన చలో విజయవాడ చేపడతామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఫెడరేషన్ ఆధ్వర్యాన శ్రీకాకుళం నగరంలోని పొట్టి శ్రీరాములు కూడలి వద్ద, ఇచ్ఛాపురం పట్టణంలోని బస్టాండ్ కూడలి వద్ద గురువారం మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మున్సిపల్ కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలని, కార్మికులందరికీ సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. క్లాప్ డ్రైవర్లకు రూ.18,500 వేతనం చెల్లించాలని, సకాలంలో వేతనాలు చెల్లించాలని, ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి మున్సిపల్ కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ సిబ్బందిని ఆరు నెలల్లో పర్మినెంట్ చేస్తామని చెప్పి నాలుగున్నరేళ్లు గడుస్తున్నా ఇంతవరకు ఏ ఒక్కరినీ పర్మినెంట్ చేయలేదన్నారు. నమ్మి ఓట్లు వేసి గెలిపించిన మున్సిపల్ కార్మికులను నట్టేట ముంచారని విమర్శించారు. కాంట్రాక్టు కార్మికులను ఆప్కాస్‌లో చేర్చి శాశ్వత బానిసలను చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. దళారీ వ్యవస్థ ద్వారా క్లాప్ డ్రైవర్లను నియమించి కనీస వేతనాలు అమలు చేయడం లేదన్నారు. ఇచ్చిన ఎన్నికల హామీల అమలు కోసం ఈనెల 21న బైక్ ర్యాలీ నిర్వహించనున్నట్లు తెలిపారు. మున్సిపల్ కార్మికుల సమస్యల పరిష్కారంపై ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉందో, లేదో చెప్పాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం మొండివైఖరి వీడి కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించే వరకు మున్సిపల్ కార్మికులు, సిపిఎస్, ఆప్కాస్ కార్మికులు, క్లాప్ డ్రైవర్లు పోరాటాల్లో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఫెడరేషన్ నాయకులు కళ్యాణ రాజు, ఎ.రాము, డి.విట్టలు, ఎ.జనార్దన్, పార్వతి, గంగాధర రౌత్, రవి లిమాయి, బృంద బంగారి తదితరులు పాల్గొన్నారు.

వచ్చే నెలలో ఉద్దానం వాటర్ ప్రాజెక్టు ప్రారంభం

పంచాయతీరాజ్ ముఖ్య కార్యదర్శి బి.రాజశేఖర్

ప్రజాశక్తి - మెళియాపుట్టి, ఇచ్ఛాపురం



పనులను పరిశీలిస్తున్న పంచాయతీరాజ్ ముఖ్య కార్యదర్శి రాజశేఖర్

ఉద్దానం మెగా వాటర్ ప్రాజెక్టును వచ్చే నెలలో ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు పంచాయతీరాజ్ శాఖ ముఖ్య కార్యదర్శి బుడితి రాజశేఖర్ తెలిపారు. మెళియాపుట్టి వద్ద ఉద్దానం ప్రాజెక్టు పనులను గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే నెల మొదటి వారానికి ఉద్దానం తాగునీటి ప్రాజెక్టు నీరు ఉద్దానంలోని అన్ని గ్రామాలకు వెళ్లే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. హిరమండలం నుంచి ఇచ్ఛాపురం వరకు పైపులైను పనులు 90 శాతం పనులు పూర్తయ్యాయని తెలిపారు. నీటి పరీక్షలు సైతం పరిశీలించాలని, ఈ నెలాఖరుకు పనులు పూర్తి చేయాలని ఇంజినీరింగ్ సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్, ఆర్‌డిఒ సీతారామ్మూర్తి, ఆర్‌డబ్ల్యుఎస్ ఇంజినీర్ ఇన్ చీఫ్ కృష్ణారెడ్డి, జల్ జీవన్ మిషన్ సిఇ గాయత్రీదేవి, ఉద్దానం వాటర్ ఇంజినీర్ ఇన్ చీఫ్ పి.సంజయ్ రెడ్డి, ఎస్ఇ టి.ఎస్ ప్రసాద్, ఇఇ జాన్ బెహరా, తహశీల్దార్ పి.సరోజని, ఎంపిడిఒ పి.చంద్రకుమారి తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటికీ తాగునీరు అందించాలి

ఉద్దానం తాగునీటి ప్రాజెక్టు ద్వారా ఇచ్ఛాపురం నియోజకవర్గంలో ఇంటింటికీ తాగునీరందించేందుకు చర్యలు తీసుకోవాలని పంచాయతీరాజ్ శాఖ ముఖ్య కార్యదర్శి బుడితి రాజశేఖర్‌ను కోరారు. ఉద్దానం వాటర్ ప్రాజెక్టు పరిశీలనకు ఇచ్ఛాపురం వచ్చిన ఆయన్ను విజయ కలిశారు.



త్వరితగతిన ప్రాధాన్యతా భవనాల పూర్తి

శ్రీకాకుళం అర్బన్ : జిల్లాలో చేపడుతున్న ప్రాధాన్యతా భవనాలు, గృహ నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలని గృహ నిర్మాణ సంస్థ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి మహమ్మద్ దివాన్ మైదీన్, కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ ఆదేశించారు. కలెక్టరేట్ నుంచి మండల స్థాయి అధికారులతో గురువారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో చేపడుతున్న రీ సర్వే పనులు మరింత వేగవంతం కావాలన్నారు. ప్రభుత్వ ప్రాధాన్యత భవనాలైన సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, వైఎస్ఆర్ క్లినిక్స్, బల్క్ మిల్క్ సెంటర్స్, గొడౌన్లను వీలైనంత త్వరగా పూర్తిచేయాలని సూచించారు. జిల్లాలో చేపట్టిన పేదలందరికీ ఇల్లు ప్రగతిలో ఉన్నా లక్ష్యసాధనలో మిగిలిన గృహాలనూ పూర్తి చేయాలని ఆదేశించారు. ముఖ్యమంత్రి త్వరలో సామూహిక గృహ ప్రవేశాల తేదీని ఖరారు చేసే అవకాశముందని, ఈలోగా ప్రగతిని సాధించాలన్నారు. సమావేశంలో జెడ్‌పి సిఇఒ ఆర్.వెంకట్రామన్, గృహనిర్మాణ సంస్థ పీడీ ఎన్.గణపతి, జిల్లా పంచాయతీ అధికారి వి.రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

గృహ నిర్మాణాల లక్ష్యాన్ని పూర్తి చేయాలి

- పూర్తయిన ఇళ్లకు మౌలిక వసతులు కల్పించాలి
- గృహ నిర్మాణ సంస్థ ప్రత్యేక కార్యదర్శి మహమ్మద్ దివాన్ మైదీన్



సమావేశంలో మాట్లాడుతున్న మహమ్మద్ దివాన్ మైదీన్

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

నవరత్నాల్లో భాగంగా జిల్లాకు నిర్దేశించిన గృహ నిర్మాణాల లక్ష్యాన్ని వెంటనే పూర్తి చేయాలని గృహనిర్మాణ సంస్థ ప్రత్యేక కార్యదర్శి మహమ్మద్ దివాన్ మైదీన్ అన్నారు. నగరంలోని బాపూజీ కళామందిర్‌లో గురువారం నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో సామూహిక గృహ ప్రవేశాల కోసం 35 వేల నిర్మాణాలను లక్ష్యంగా నిర్దేశించామని చెప్పారు. ఇప్పటివరకు 30 వేల ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యాయన్నారు. గృహ నిర్మాణాల విషయంలో జిల్లా ప్రగతి బాగుందంటూ కితాబునిచ్చారు. నిర్దేశించిన లక్ష్యంలో మిగిలిన ఐదు వేల ఇళ్లనూ త్వరితగతిన పూర్తి చేసి సిద్ధం చేయాలని సూచించారు. ఇళ్ల నిర్మాణ బిల్లుల విషయంలో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకుని చెల్లింపులు పూర్తి చేయాలని తెలిపారు. నిర్మాణ బిల్లులను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాల్సి ఉందన్నారు. ప్రభుత్వం గృహ ప్రవేశాల తేదీని ఖరారు చేసే లోగా గృహాలన్నీ సిద్ధంగా ఉండాలని సూచించారు. ఇళ్ల నిర్మాణాలతో పాటు మౌలిక సదుపాయాలు కల్పించేందుకు సంబంధిత శాఖలు సమన్వయంతో ముందుకు సాగాలన్నారు. నిర్మాణాలకు అవసరమైన సిమెంట్, ఇసుక, ఇనుము సమస్యలు లేవని, అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలని సూచించారు.

నిర్మాణాలు పూర్తయిన మేరకు ఎప్పటికప్పుడు లబ్ధిదారుల ఖాతాకు జమ చేస్తున్నట్లు తెలిపారు. పూర్తి చేసిన పనుల పెండింగ్ బిల్లులు లేకుండా డిజిటల్, ఇంజినీరింగ్ అసిస్టెంట్ల ద్వారా బిల్లులను అప్‌లోడ్ చేయాల్సి ఉంటుందని చెప్పారు. ఆర్‌బికెలు, సచివాలయాలు, వెల్‌నెస్ సెంటర్లను త్వరితగతిన పూర్తి చేయడంపై దృష్టిసారించాలని సూచించారు. అనంతరం రాగోలు లేఅవుట్‌లో చేపడుతున్న గృహాలను పరిశీలించారు. రోడ్డు నిర్మాణాలు, తాగునీటి సౌకర్యం త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. సమావేశంలో గృహ నిర్మాణ సంస్థ పథక సంచాలకులు ఎన్.గణపతి, ఉప కార్యనిర్వాహక ఇంజినీర్ నాగేశ్వరరావు, అర్బన్ సహాయ ఇంజినీర్ గణేష్, ఉప కార్యనిర్వాహక, కార్యనిర్వాహక ఇంజినీర్లు, మున్సిపల్ కమిషనర్లు, ఎంపిడిఒలు, గ్రామ, వార్డు ఇంజినీర్ సహాయకులు, ఆర్‌డబ్ల్యుఎస్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

సమగ్ర చట్టం చేయాలి

కలెక్టరేట్ వద్ద హమాలీ కార్మికుల ధర్నా

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

హమాలీ కార్మికులకు సమగ్ర చట్టం చేయాలని, పెరిగిన ధరలకు అనుగుణంగా కూలి రేట్లు పెంచాలని సిఐటియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సిహెచ్.అమ్మన్నాయుడు, పి.తేజేశ్వరరావు, హమాలీ కార్మికుల ఫెడరేషన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బి.చిన్నారావు, కె.సూరయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇవే డిమాండ్లపై హమాలీ కార్మికుల ఫెడరేషన్ ఆధ్వర్యాన హమాలీ కార్మికులు కలెక్టరేట్ వద్ద గురువారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హమాలీ, జట్టు, ముఠా, కళాసీ కార్మికులకు పని భద్రత కల్పించాలన్నారు. కార్మికులందరికీ పిఎఫ్, ఇఎస్ఐ, ప్రమాద బీమా, పెన్షన్‌తో కూడిన సమగ్ర చట్టం చేయాలని డిమాండ్ చేశారు. సమగ్ర చట్టం అమలు కోసం వెల్ఫేర్ బోర్డు, సంక్షేమ నిధి ఏర్పాటు చేయాలని కోరారు. రాష్ట్రంలో మార్కెట్ యార్డులు, బజారు కొట్లు, పళ్లు, కూరగాయల మార్కెట్లు, ఆర్‌టిసి, ప్రభుత్వ, ప్రైవేటు గొడౌన్లు, ఎఫ్‌సిఐ, వేర్‌హౌస్, సివిల్ సప్లయిస్, రైస్‌మిల్స్ తదితర చోట్ల సుమారు ఆరు లక్షల మంది ముఠా కార్మికులు పనిచేస్తున్నారని తెలిపారు. పనిభద్రత లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెప్పారు. పనిచేస్తున్న చోట ప్రమాదం సంభవించి అంగవైకల్యం పొందినా, ప్రాణాలు కోల్పోయినా పట్టించుకునే దిక్కు లేదని ఆవేదన వ్యక్తం చేశారు. దశాబ్దాల తరబడి ప్రభుత్వాల నిర్లక్ష్యం వల్ల తీవ్ర అన్యాయం జరుగుతోందన్నారు. 50 కేజీలకు మించిన బరువులను మోయించరాదని అంతర్జాతీయ కార్మిక సంస్థ తీర్మానించినా, అమలుకు నోచుకోవడం లేదని విమర్శించారు. అధికార, ప్రతిపక్ష పార్టీలు ముఠా కార్మికుల సమస్యలపై పల్లెత్తు మాట మాట్లాడడం లేదన్నారు. హమాలీ, ముఠా, కళాసీ కార్మికులు సంఘటితంగా పోరాడాలని పిలుపునిచ్చారు. ధర్నా అనంతరం డిఆర్‌ఒ పి.మురళీకృష్ణకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో పట్టణ పౌర సంక్షేమ సంఘం నాయకులు టి.తిరుపతిరావు, కె.లక్ష్మీనారాయణ, పి.అప్పలరాజు, డి.మహాలక్ష్మి, బి.రామారావు, టి.సూర్యనారాయణ, ఎన్.దుర్గారావు, కె.కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న ముఠా కార్మికులు

మహిళా సాధికారతపై ప్రత్యేక దృష్టి

జెడ్‌పి ఛైర్‌పర్సన్ పి.విజయ

ప్రజాశక్తి - కవిటి

మహిళా సాధికారితపై ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రత్యేక దృష్టిసారించి మహిళల రక్షణ, అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నారని జిల్లాపరిషత్ ఛైర్‌పర్సన్ పిరియా విజయ తెలిపారు. తన నివాసంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. మహిళల భద్రత కోసం దిశ యాప్, పోలీస్‌స్టేషన్లు ప్రవేశపెట్టినట్లు గుర్తు చేశారు. దిశ యాప్ 1.7 కోట్ల రిజిస్ట్రేషన్లు నమోదు చేసిందని, ఈ యాప్ ద్వారా 30 వేల మందికి పైగా అమ్మాయిలకు రక్షణ కల్పించినట్లు తెలిపారు. అమ్మఒడి, జగనన్న విద్యా కానుక తదితర పథకాలతో పాటు బడుగు బలహీన వర్గాలకు నాణ్యమైన విద్యను అందిస్తున్నట్లు చెప్పారు. అర్హులైన ప్రతి విద్యార్థికి పూర్తి ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను అందిస్తూ వసతి దీవెన, విద్యా దీవెన తదితర పథకాలు అమలు చేస్తున్నట్లు తెలిపారు. గ్రామ, వార్డు వాలంటీర్లలో 53 శాతం, గ్రామ, వార్డు సచివాలయాల్లో 50 శాతం కంటే ఎక్కువ మంది మహిళలకు అవకాశం కల్పించినట్లు చెప్పారు. సున్నా వడ్డీ పథకం కింద గత రెండు ఆర్థిక సంవత్సరాల్లో గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో కోటి ఎస్‌హెచ్‌జి మహిళలకు రూ.3,615 కోట్లు కేటాయించినట్లు తెలిపారు. కాపు నేస్తం, వైఎస్ఆర్ పెన్షన్ కానుక, వైఎస్ఆర్ కళ్యాణమస్తు, షాదీ తోఫా వంటి పథకాలతో వైసిపి ప్రభుత్వం మహిళలకు పెద్దపీట వేస్తోందన్నారు. రాష్ట్రంలో సంక్షేమ, అభివృద్ధి పాలన చూసి పవన్ కళ్యాణ్, చంద్రబాబు ఓర్వలేక వాలంటీర్ వ్యవస్థపై, ప్రభుత్వంపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. దీన్ని దృష్టిలో పెట్టుకుని వైసిపి కార్యకర్తలు ప్రజలతో మమేకమై 2024లో మళ్లీ వైసిపి అధికారంలోకి వచ్చేలా కృషి చేయాలని పిలుపునిచ్చారు.



మాట్లాడుతున్న జెడ్‌పి ఛైర్‌పర్సన్ విజయ

ఐటి కేసులపై ప్రత్యేక దృష్టి

ఎస్‌పి రాధిక

ప్రజాశక్తి - శ్రీకాకుళం

పోలీస్‌స్టేషన్‌లో నమోదైన ఐటి కేసులపై ప్రత్యేక దృష్టిసారించాలని ఎస్‌పి జి.ఆర్ రాధిక అన్నారు. వార్షిక తనిఖీల్లో భాగంగా శ్రీకాకుళం రెండో పట్టణ పోలీస్‌స్టేషన్‌ను గురువారం సందర్శించారు. ముందుగా పోలీస్ స్టేషన్ పైభాగంలో ఉన్న కమాండ్ కంట్రోల్‌రూమ్‌ను సందర్శించి సిసి కెమెరాల పనితీరుపై ఆరా తీశారు. దర్యాప్తులో ఉన్న ముఖ్యమైన కేసుల రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించి గ్రేవ్ కేసులు, ఐటి కేసుల దర్యాప్తును త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. సైబర్ ఫిర్యాదులపై తక్షణమే స్పందించి సదరు బ్యాంకు అధికారులతో చర్చించి బాధితులకు న్యాయం జరిగేలా చూడాలని చెప్పారు. రాత్రివేళలో బీట్ల సంఖ్య పెంచి తరచూ నేరాలు జరిగే చోట బీట్ సిబ్బంది తిరుగుతూ పాత నేరస్తులపై ప్రత్యేక నిఘా ఉంచాలన్నారు. అవసరమైన చోట సిసి కెమెరాలను ఏర్పాటు చేసి నేరాల నియంత్రణకు ప్రత్యేక కార్యాచరణతో ప్రతిఒక్కరూ అంకితభావంతో పనిచేయాలన్నారు. ఎస్‌పి వెంట డిఎస్‌పి వై.శృతి, సిఐ పి.శ్రీనివాసరావు తదితరులున్నారు.



కమాండ్ కంట్రోల్ రూమ్‌ను పరిశీలిస్తున్న ఎస్‌పి రాధిక

డిఐపిఆర్‌ఒగా చెన్నకేశవరావు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్



జిల్లా సమాచార, పౌర సంబంధాల అధికారి (డిఐపిఆర్‌ఒ)గా కె.చెన్నకేశవరావు గురువారం బాధ్యతలు చేపట్టారు. అనంతరం కలెక్టరేట్‌లో కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్‌ను గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. సమాచార, పౌర సంబంధాల శాఖలో సహాయ ఇంజినీరుగా 1996 ఆగస్టు ఒకటో తేదీన ఉద్యోగ బాధ్యతలు చేరిన ఆయనకు 2006లో సహాయ కార్యనిర్వాహక ఇంజినీర్‌గా ఉద్యోగోన్నతి లభించింది. ఉమ్మడి శ్రీకాకుళం, విశాఖపట్నం జిల్లాలో పనిచేశారు. ప్రస్తుతం విశాఖపట్నం ప్రాంతీయ సమాచార ఇంజినీర్ కార్యాలయంలో సహాయ కార్యనిర్వాహక ఇంజినీర్‌గా విధులు నిర్వహిస్తున్న ఆయనకు ఉప కార్యనిర్వాహక సమాచార ఇంజినీర్‌గా ఉద్యోగోన్నతి కల్పిస్తూ శ్రీకాకుళం డిఐపిఆర్‌ఒగా ప్రభుత్వం నియమించింది.

నేడు ఉద్యోగుల గ్రీవెన్స్

శ్రీకాకుళం అర్బన్ : ప్రతి నెలా మూడో శుక్రవారం నిర్వహించాల్సిన ప్రభుత్వ ఉద్యోగుల గ్రీవెన్స్‌ను ఈనెల 18న కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 11.30 గంటల వరకు నిర్వహించే గ్రీవెన్స్‌లో ఉద్యోగుల సమస్యలపై వినతులు స్వీకరించనున్నట్లు పేర్కొన్నారు.

మహారాజశ్రీ విజయవాడ 4వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టు

OS.No. 1086/2022

Between:-
M/s Kejal Marketing Rep by its Managing Partner Kalpesh Jain, S/o Moolchand Jain, D.No.27-6-30, D.T.Rao Lane, Governorpet, Vijayawada. ...Plaintiff
And
M/s Saraswathi Trading Rep by.its Authorized Signator/Proprietor Yeddu Jogi Naidu, Others name not Known, R/o Bora Sriramulu Complex, Battili Road, Near SBI Kotturu, Srikakulam-532455. ...Defendant

ప్రకటన

పై నంబరు దావా వాది కంపెనివారు మీపై దావా బాకీ రూ॥ 83,192.00 లను మరియు వడ్డీ ఖర్చులు రాబట్టుకొనుటకు మీపై పై కోర్టులో దావా వాది కంపెనివారు దాఖలు చేసియున్నారు. సదరు దావాలో మీకు ఏట్టి అభ్యంతరములు ఉన్నయెడల తెలుపుకునే నిమిత్తం ది.11-09-2023వ తేది ఉదయం 10-30 గం॥లకు పై కోర్టువారి ఎదుట మీరు స్వయంగా గాని లేదా న్యాయవాది గారి ద్వారా గాని హాజరై ఆక్షేపణలు తెలుపుకొవలెను. లేని యెడల మీ పరోక్షమున తీర్మానించబడునని ఇందు మూలముగా తెలియజేయ డమైనది.

VIjayawada
11-08-2023

**Pilla Ravindra Kumar,
A.Gopala Krishna,
Advocates,
Gandhi Nagar,
Vijayawada-3,
Cell:9391919333**

**IN THE HONOURBLE COURT OF THE SENIOR CIVIL JUDGE AT TEKKALI.
SOP. 4/2023**

Between:
1. K. Renuka Murthy w/o Late Narasinga Murthy age 42 years, N/o D.No. 1-181, Konusula Kothur (V), Tekkali Mandal Srikakulam (Dist).
Temprarly Residing at Directorate of Fisheries, Dry Dock, Jobra Mangalabag Cuttals Sadar,Odisha State.
2. K. Mahesh Murthy S/oLate Narasinga Murthy, age 16 years student Rest -DO-
3. K. Riya Murthy D/o Late Narasinga Murthy, age 19 years, Rest -Do.
--Petitioners
And: **Nil** --Respondants.

పై నెంబరు గల పిటీషన్‌లో పిటిషనర్లు సక్షషన్ సర్టిఫికెట్ పొందుట కొరకు పై కోర్టులో పిటీషన్ దాఖలు చేసి యున్నారు. సదరు పిటిషన్‌లో ఎవరికైనా ఎట్టి అభ్యంతరములు ఉన్నచో **తేది 25-08-2023న ఉ॥ 10.30 ని॥**లకు పైన తెలిపిన కోర్టు యందు మీరు స్వయంగా గాని, మీ వకీలు ద్వారా గాని హాజరై మీ అభ్యంతరములు తెలియజేయగలరు. లేని యడల మీపరోక్షమున పిటిషనరుకు అనుకూలముగా తీర్మానించబడును.

**ఎల్. బాలక్రిష్ణ,
న్యాయవాది, టెక్కలి,
ఫోన్: 9491817203.**

**IN THE HONORABLE COURT OF 1ST ADDITIONAL DISTRICT JUDGE AT SRIKAKULAM
O.S No. 8/2023**

Between: **Chinnala Kurminaidu** S/o Ranagarao Naidu, Aged 53 years, Hindu, residing at Kummaraigunta Village, Aludu post, Sarvakota Mandalam, Srikakulam Distric 2.Andhavarapu Srinivasarao son oOf late Satyanarayana Aged 53 years, Opp: co-co cola Godowns, Sarda hi-tech city Uda - lay-out, Srikakulam Town and District.
--Plaintffs
And: **Barri Anilkumar** S/o Eswararao, aged 56 years, Plot No. 37, Hazialinagar, Vizianagaram Municipality Town and District.
--Defendants

NOTICE

To, **Barri Anilkumar** S/0 Eswararao, aged 56 years, Plot No. 37, Hazialinagar, Vizianagaram Municipality Town and District.

Please take notice that the above matter was filed by the above plaintiffs for the specific performance of sale agreement dated 23.12.2019 executed by you in favour of the plaintiffs. The plaintiffs filed file process to serve summons to you on the order of the honorable court. But returned un-served due intentionally avoid to receive the same. Hence The honorable court ordered to serve summons by substitute service i.e by way of publication in Praga/sakti daily news paper, Vizianagaram local and posted the above matter to **31.08.2023 atv 10.30 AM,** for your appearance in person or through council on that day. Otherwise the honorable court will pass appropriate orders basing on the material on record in your absence.

(By order of the honorable court)

**Andhavarau Venkateswarlu
Advocate
Ajantha Encave, Flat No.F-3
Kattera veedhi,Srikakulam Town & District Mobile No.9010811317.**



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి ధర్మాన ప్రసాదరావు

ఎన్‌జిఒ రాష్ట్ర మహాసభల పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

ఉద్యోగులు ప్రభుత్వంతో సమన్వయంతో పనిచేసినప్పుడే ప్రజలకు మెరుగైన సేవలు అందుతాయని రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. పెద్దపాడులోని ఆయన క్యాంపు కార్యాలయంలో ఎపి నాన్ గజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ 21వ రాష్ట్ర మహాసభల పోస్టర్‌ను ఎన్‌జిఒ నాయకులతో కలిసి గురువారం ఆవిష్కరించారు. ఎన్‌జిఒ అసోసియేషన్ రాష్ట్ర సహాధ్యక్షులు చౌదరి పురుషోత్తం నాయుడు మాట్లాడుతూ రాష్ట్ర మహాసభల్లో ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి పాల్గొంటారని తెలిపారు. ఆ సమయంలో ఉద్యోగులకు ప్రయోజనం చేకూర్చే విధానాన్ని ప్రభుత్వం చేకుస్తుందన్న భావన ఉద్యోగుల్లో ఉందన్నారు. అనంతరం కలెక్టరేట్‌లో కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్‌ను కలిశారు. అలాగే ఎపి ఎన్‌జిఒ జిల్లా అధ్యక్షులు హనుమంతు సాయిరాం మాట్లాడుతూ రాష్ట్ర మహాసభలో పెండింగ్‌లో ఉన్న పలు సమస్యలపై చర్చిస్తామని తెలిపారు. రాష్ట్ర కౌన్సిల్‌లో భవిష్యత్ కార్యాచరణ, విధి విధానాలపై పూర్తి స్థాయిలో చర్చిస్తామన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి చల్లా శ్రీనివాసరావు, ట్రెజరర్ బడగల పూర్ణచంద్రరావు, పట్టణ అధ్యక్షులు బొత్స శ్రీనివాసరావు, పూజారి జానకిరామ్, వైస్ ప్రెసిడెంట్ టి.సోమేశ్వరరావు, జాయింట్ సెక్రటరీ బి.భాస్కరప్రసాద్, కె.వి.నారాయణరావు, ఆర్.అప్పలరాజు, పి.రవికుమార్, కె.మోహనరావు, మహేశ్వరరావు, రమణ, లీలాకుమారి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మహాలక్ష్మి

విఒఎలను ఉద్యోగులుగా గుర్తించాలి

ఆమదాలవలస : వెలుగు సంస్థలో పనిచేస్తున్న విఒఎలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు అల్లు మహాలక్ష్మి, విఒఎల సంఘం జిల్లా కార్యవర్గ సభ్యులు జి.అసిరినాయుడు ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. పట్టణంలోని మార్కెట్ కమిటీ యార్డులో సిహెచ్.అన్నపూర్ణ అధ్యక్షతన విఒఎ క్లస్టర్ సమావేశాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విఒఎల ఉపాధిని దెబ్బతీసే మూడేళ్ల కాలపరిమితి సర్క్యులర్‌ను రద్దు చేయాలన్నారు. సంఘాలను విడగొట్టడం, కలపడం లాంటి పనులు సెర్ప్ అధికారులే చేయడం సరైనది కాదన్నారు. ఇప్పటివరకు 15 సంఘాలలోపు ఉన్న విఒల వేతనాలు చెల్లించాలన్నారు. వయసు పైబడిన వారికి, అనారోగ్యంతో ఉన్న వారికి, వారి కుటుంబ సభ్యులకు విఒఎలుగా అవకాశం కల్పించాలన్నారు. రూ.పది లక్షల గ్రూప్ ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలన్నారు. సమావేశంలో విఒఎ మండలాల నాయకులు ఎస్.రాజ్యలక్ష్మి, టి.శోభ, జి.సుభాషిని, బి.శ్రీదేవి, పి.రమణమ్మ పాల్గొన్నారు.

నేడు న్యాయవిజ్ఞాన సదస్సు

టెక్కలి : మండలంలోని గోపినాథపురంలో శుక్రవారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించనున్నామని సివిల్ జడ్జి జె.శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. బాల్య వివాహాల నిరోధక చట్టం పటిష్టతలో భాగంగా ఈ సదస్సు నిర్వహించనున్నామని అన్నారు. లైంగిక నేరాల నుంచి పిల్లలను ఎలా రక్షించాలి అనే విషయంపైనా సదస్సులో చర్చించనున్నామని చెప్పారు. సమగ్ర స్త్రీ శిశుసంక్షేమశాఖ ఆధ్వర్యాన నిర్వహించనున్న ఈ సదస్సుకు మేధావులు పాల్గొనాలని సూచించారు.

దాడి చేసిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలి

శ్రీకాకుళం అర్బన్ : జిల్లాలోని టెక్కలి డివిజన్ కేంద్రంలో ఉన్న ఎన్‌టిఆర్ కాలనీ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయురాలిగా పనిచేస్తున్న కె.విజయలక్ష్మిపై దాడి చేసిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి చౌదరి రవీంద్ర ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. పాఠశాల మరమ్మతులకు సంబంధించిన బకాయి బిల్లులు చెల్లించాలని ప్రధానోపాధ్యాయురాలిపై దాడి చేయడం సరికాదన్నారు. ఉపాధ్యాయులపై ఈ రకంగా దాడి చేయడం అమానుషమన్నారు. ఇటువంటి చర్యలు పునరావృతం కాకుండా చూడాలని, ఆమెకు రక్షణ కల్పించి దాడి చేసిన వ్యక్తిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ప్రకటన విడుదల చేసిన వారిలో జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పొందూరు అప్పారావు, ఎస్.కిషోర్‌కుమార్‌లు ఉన్నారు.

వాడివేడిగా మండల సమావేశం

ప్రజాశక్తి- రణస్థలం

మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిపి పిన్నింటి రజని అధ్యక్షతన గురువారం నిర్వహించిన మండల సమావేశం వాడివేడిగా సాగింది. ముందుగా విద్యుత్‌శాఖ ఎఇ ఎం.శ్రీనివాసరావుపై నెలివాడ సర్పంచ్ ప్రతినిధి పతివాడ శ్రీరామ్మూర్తి ధ్వజమెత్తారు. కోష్ట విద్యుత్ లైన్‌మేన్ సంతోష్ 12 వ్యవసాయ బోర్లకు సంబంధించి విద్యుత్ కనెక్షన్ల కోసం రూ.6.28 లక్షలు ఎఇ సమక్షంలో తీసుకుని నెలలు గడుస్తున్నా ఇంతవరకూ మంజూరు చేయలేదని సభ దృష్టికి తీసుకొచ్చారు. విద్యుత్ కార్యాలయం చుట్టూ కాళ్లరిగేలా తిరిగినా ఇప్పటికీ మంజూరు కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. దేరసాం ఎంపిటిసి దన్నాన వంశీకృష్ణ మాట్లాడుతూ అదే లైన్‌మేన కోసం సుంకరి సన్యాసి అనే రైతు దగ్గర రూ.45 వేలు తీసుకుని నెలలు గడుస్తున్నా మంజూరు చేయలేదని అన్నారు. ఈ విషయంపై ఎఇకి ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని స్పందించడం లేదని అన్నారు. కృష్ణాపురం ఎంపిటిసి చినరామునాయుడు మాట్లాడుతూ తహశీల్దార్



మాట్లాడుతున్న ఎంపిపి రజని

కిరణ్‌కుమార్ ఒక్క మండల సమావేశానికీ హాజరుకాలేదని అన్నారు. కార్యాలయానికి వెళ్తే గంటల తరబడి బయట కూర్చోబెడుతున్నారని అన్నారు. ఈ సందర్భంగా జడ్‌పిటిసి టొంపల సీతారాం మాట్లాడుతూ మండల సమావేశాలకు మండలస్థాయి అధికారులు రాకుండా అసిస్టెంట్లను పంపిస్తున్నారని, దీనిపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని తెలిపారు. మండల ఎఒ భాస్కరరావు మాట్లాడుతూ రైతులకు సబ్సిడీపై వరి విత్తనాలు అందించామని చెప్పారు. పాతర్లపల్లి వైద్యాధికారి చైతన్య మాట్లాడుతూ ఆస్పత్రిలో అన్ని రకాల మందులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. డాక్టర్ రెడ్డీస్ పరిశ్రమ యాజమాన్యం కార్పొరేట్ ఆస్పత్రిగా అభివృద్ధి చేసిందని అన్నారు.

ఎంఇఒలు ఎ.త్రినాథరావు, బి.లావణ్య మాట్లాడుతూ ప్రభుత్వం అందించిన పాఠ్యపుస్తకాలు, యూనిఫారాలు, బూట్లు, బ్యాగులు అందించామని అన్నారు. రోజూ పాఠశాలలను సందర్శించి విద్యపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవడంతో పాటు మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్నామని అన్నారు. పశుసంవర్థకశాఖ వైద్యాధికారి రాంకుమార్ మాట్లాడుతూ సబ్సిడీపై గడ్డి విత్తనాలు ఇస్తున్నట్లు పేర్కొన్నారు. మత్స్యశాఖ అధికారి కె.గంగాధర్ మాట్లాడుతూ మత్స్యకారులకు సబ్సిడీపై డిజల్ ఇస్తున్నట్లు తెలిపారు. ఐసిడిఎస్ పిఒ ఝాన్సీరామ్ మాట్లాడుతూ గర్భిణులకు, బాలింతలకు పౌష్టికాహారం ఇంటి వద్దకు తీసుకెళ్లి అందజేస్తున్నామని అన్నారు. సమావేశంలో ఎంపిపి ప్రతినిధి పిన్నింటి సాయికుమార్, ఎంపిడిఒ రమణమూర్తి, మండల ప్రత్యేక అధికారి దుర్గారావు పాల్గొన్నారు.

అధైర్యపడకు... అండగా ఉంటాం

- చిన్నారి తండ్రికి దాతల భరోసా
- మూడు రోజుల్లోనే రూ.4.5 లక్షలు జమ
- 'ప్రజాశక్తి' కథనానికి అనూహ్య స్పందన

ప్రజాశక్తి- కవిటి

లేక లేక కలిగిన సంతానాన్ని కాపాడుకోవడానికి పాటుపడుతున్న చిన్నారి ఆద్య తండ్రి చిరంజీవికి దాతలు అండగా నిలుస్తున్నారు. అధైర్యపడకు.. అండగా ఉంటామని భరోసా ఇస్తున్నారు. 'చిన్ని గుండెకు పెద్ద కష్టం' శీర్షికన ఈనెల 15వ తేదీన 'ప్రజాశక్తి'లో వచ్చిన కథనానికి దాతల నుంచి అనూహ్య స్పందన లభిస్తోంది. దాని ఫలితంగా కేవలం మూడు రోజుల్లోనే రూ.4.50 లక్షలు చిరంజీవి ఖాతాకు దాతలు జమ చేశారు. విశాఖపట్నం గాంధీ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న చిన్నారి ఆద్యాను జనసేన నాయకులు లోళ్ల రాజేష్ గురువారం పరామర్శించారు. చిన్నారి ఆరోగ్యం



ఆర్థికసాయం అందిస్తున్న రాజేష్

గురించి వైద్యులతో మాట్లాడి తండ్రి చిరంజీవికి ధైర్యం చెప్పారు. తనవంతుగా రూ.10 వేలు సాయం అందించి, విషయాన్ని జనసేన అధినేత పవన్ కళ్యాణ్ దృష్టికి తీసుకెళ్లి మెరుగైన వైద్యం నిర్వహించేందుకు కృషి చేస్తానని తెలిపారు. అదే విధంగా స్థానిక ఉషోదయ యువజన సంఘం తరపున అధ్యక్షుడు పాండవ శేఖర్, మాజీ సర్పంచ్ ఆరింగి మధు, ఆరింగి రాజు తదితరులు చిరంజీవి తల్లిదండ్రులకు రూ.15,500 అందజేశారు. శ్రీచింతామణి ఆటో యూనియన్ రూ.ఐదు వేలు, ప్రగడపుట్టుగకు చెందిన విశ్రాంత మెడికల్ అధికారి



ఆర్థికసాయం అందిస్తున్న సభ్యులు

పిరియా కృష్ణారావు రూ.ఐదు వేలు, రాజపురం ప్రభుత్వాస్పత్రి వైద్యులు డాక్టర్ శశిధర్ రూ.ఐదు వేలు, చిరంజీవితో చదివిన స్నేహితులు రూ.10 వేలు, ప్రగడపుట్టుగకు చెందిన గుడియా నారాయణ రూ.5 వేలు, సోంపేటకు చెందిన అమన్‌కుమార్ రూ.5 వేలు అందజేశారు. ఈ సందర్భంగా చిరంజీవి మాట్లాడుతూ కేవలం మూడు రోజుల్లోనే దాతల నుంచి తనకు రూ.4.50 లక్షలు అందాయని, తన పాప కోసం సాయం చేస్తున్న ప్రతి హృదయానికి చెమ్మగిల్లిన కళ్లతో కృతజ్ఞతలు తెలిపాడు. తమ చిన్నారి కోసం ఇంతమంది దాతలు స్పందించేలా చేసిన 'ప్రజాశక్తి' పత్రికకు జీవితాంతం రుణపడి ఉంటానని వినమ్రంగా తెలిపాడు.



నిరసన తెలుపుతున్న ప్రతినిధులు

విద్యుత్ ఛార్జీల భారం తగ్గించాలి

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

గృహ అవసరాలతో పాటు వాణిజ్య, వ్యవసాయ అవసరాలకు విద్యుత్ వినియోగం తక్కువగా ఉన్నా విద్యుత్ బిల్లులు పెద్దఎత్తున పెంచేశారని, తక్షణమే పెంచిన విద్యుత్ బిల్లులు తగ్గించి ప్రజలకు ఉపశమనం కలిగించాలని శ్రీకాకుళం టెక్స్ పేయర్స్ అసోసియేషన్ ప్రతినిధులు డిమాండ్ చేశారు. అసోసియేషన్ ఆధ్వర్యాన పెంచిన విద్యుత్ ఛార్జీలను నిరసిస్తూ సేకరించిన 1738 సంతకాలతో కూడిన వినతులను, ఇపిడిసిఎల్ సూపరింటెండెంట్ ఇంజినీర్ ద్రైవకుమార్‌కు గురువారం అందజేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ కార్యదర్శి మణికొండ ఆదినారాయణమూర్తి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఆదేశాలు మేరకు రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్ ఛార్జీలను పెంచిందన్నారు. శ్లాబులు మార్చి పదేళ్లకాలం పాటు వినియోగించుకున్న విద్యుత్ బిల్లులు చెల్లించినా, లోటు వచ్చిందని షాకుగా చూపించి సర్దుబాటు ఛార్జీల రూపంలో రూ.వేల కోట్ల అదనపు భారం వేశారని అన్నారు. పాత బిల్లులపై కొత్తగా బాకీలనడం, ఏ సరుకు గాని, సేవలకు గానీ ఎక్కడా లేదని అన్నారు. విద్యుత్ బిల్లులే కాకుండా ఫిక్సెడ్ ఛార్జీ, విద్యుత్ సుంకం, సర్దుబాటు ఛార్జీ ఇలా రకరకాల పేర్లు పెట్టి ప్రజలపై రూ.వేల కోట్ల భారం వేస్తున్నారన్నారు. అసలు ఛార్జీల కంటే కొసరు ఛార్జీలు పెంచారన్నారు. దీనికి తోడు ప్రతి ఇంటికీ, షాపుకీ స్మార్ట్ మీటర్లు పెట్టబోతున్నారని, ప్రతి కనెక్షన్ కు సుమారు రూ.13 వేలు భారం వినియోగదారునిపై పడుతుందని అన్నారు. ప్రీ పెయిడ్ మీటర్ల రూపంలో ముందుగానే ఛార్జీలు చెల్లించే విధానం తీసుకొచ్చే ఆలోచన సరికాదన్నారు. తక్షణమే స్మార్ట్ మీటర్లు, ప్రీ పెయిడ్ విధానం రద్దు చేయాలని డిమాండ్ చేశారు. విద్యుత్ ప్రభుత్వ రంగంలోనే కొనసాగాలన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు వి.జి.కె.మూర్తి, డి.శ్రీరాములు, పి.కామరాజు, జె.నీలకంఠేశ్వరరావు, పి.సుధాకరరావు, ఎం.గోవర్ధనరావు, బి.రమాప్రసాద్, జె.వి.ఎ.నరసింహం పాల్గొన్నారు.

'మెట్కోర్ అల్లాయిస్' కార్మికుల ఆందోళన

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

మండలంలోని రావివలస మెట్కోర్ అల్లాయిస్ పరిశ్రమ వద్ద గురువారం రెగ్యులర్ కార్మికులు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా కార్మికులు మాట్లాడుతూ మే నెల 28న పరిశ్రమ యాజమాన్యం లాకౌట్ నోటీసు అంటించిందని, అప్పట్లో ఒన్‌టైం సెటిల్‌మెంట్ చేస్తామని హామీనిచ్చారని అన్నారు. కానీ, అప్పటి నుంచి వివిధ సందర్భాల్లో కార్మికులు నిరసనలు తెలిపామని అన్నారు. తాజాగా పరిశ్రమ యాజమాన్య ప్రతినిధులు రెగ్యులర్ కార్మికుల టిఎస్ అంశానికి సంబంధించిన పత్రాల్లో సంతకాలు పెడితేనే బకాయి వేతనాలు చెల్లిస్తామని చెపుతున్నారని అన్నారు. 30 ఏళ్లుగా పరిశ్రమనే నమ్ముకుని జీవిస్తున్న తమకు పరిశ్రమ కాంట్రాక్టర్లు, యాజమాన్యం న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. తమ బకాయి వేతనాలను చెల్లించి పరిశ్రమను మరలా తెరిచి ఉపాధి కల్పించాలని డిమాండ్ చేశారు. విషయం తెలుసుకున్న నియోజకవర్గ వైసిపి ఇన్‌ఛార్జి, జెడ్‌పిటిసి దువ్వాడ వాణి, ఎపి మారిటైం బోర్డు చైర్మన్ కాయల వెంకటరెడ్డిలు పరిశ్రమ వద్దకు చేరుకున్నారు. కార్మికులతోనూ, పరిశ్రమ ఉన్నత స్థాయి ఉద్యోగస్తులతోనూ మాట్లాడారు. కార్మికులకు అన్యాయం జరిగే విధంగా వన్ టైం



పరిశ్రమ వద్ద ఆందోళన చేస్తున్న కార్మికులు

సెటిల్‌మెంట్ పత్రాలు ఉండడంపై ఆమె పరిశ్రమ ఉన్నత ఉద్యోగులను ప్రశ్నించారు. రావివలస పరిశ్రమ వద్ద రోజూ నిరాహారదీక్ష ప్రారంభిస్తామని హెచ్చరించారు. ఈమెతో పాటు ఎంపిపి అట్లా సరోజనమ్మ, వైస్ ఎంపిపి మున్నెల కిషోర్, ఆలయ కమిటీ చైర్మన్ సర్లాన సుధాకర్ ఉన్నారు.

యువకుడు ఆత్మహత్య

ప్రజాశక్తి- కవిటి



దేవేంద్ర (ఫైల్)

మండలంలోని కమలాయి పుట్టుగకు చెందిన సీరపు దేవేంద్ర (35) మనస్తాపంతో గురువారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. భార్య లలితతో ఉన్న గొడవలతో మనస్తాపం చెందిన దేవేంద్ర ఇంట్లోనే ఆత్మహత్య చేసుకున్నాడు. దేవేంద్ర తండ్రి నారాయణ ఇచ్చిన పిర్యాదు మేరకు కవిటి ఎస్ఐ కె.రాము కేసు దర్యాప్తు చేస్తున్నారు. దేవేంద్రకు తన్వీ అనే ఐదేళ్ల పాప ఉంది.



ప్రమాదానికి గురైన కారు

ముగ్గురికి గాయాలు

సోంపేట: మండలంలోని పాలవలస సమీపంలోని జాతీయ రహదారి వద్ద గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు వ్యక్తులకు స్వల్ప గాయాలయ్యాయి. సోంపేటకు చెందిన విద్యుత్‌శాఖ ఎడి ఇ.శ్రీనివాసరావు, ఎఇ రామారావు, జెఇ వెంకటరమణమూర్తి పలాసలో నిర్వహించిన సమావేశానికి వెళ్లారు. అనంతరం సోంపేట నుంచి కారులో బయలుదేరారు. పాలవలస సమీపంలోని ఫ్లైఓవర్ వద్దకు వచ్చేసరికి కారు టైర్ పంచర్ కావడంతో ఒక్కసారిగా అదుపు తప్పింది. ఫ్లైఓవర్ పక్క నుంచి దిగున ఉన్న సర్వీస్ రోడ్డు వైపు కారు దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న ముగ్గురికి స్వల్ప గాయాలయ్యాయి. వీరిలో మూర్తికి కాలుకు గాయం కావడంతో శ్రీకాకుళం ఆస్పత్రికి తరలించారు. బారువ ఎస్ఐ చిరంజీవి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వివాహిత అదృశ్యం

కోటబొమ్మాళి: మండలంలోని కురుడు పంచాయతీ పాకివలసకు చెందిన వివాహిత తన ఏడాది వయసు ఉన్న రెండో కుమార్తె తీసుకొని అదృశ్యమైనట్లు ఎస్ఐ షేక్ మహ్మద్ అలీ గురువారం తెలిపారు. రెండు రోజులుగా తన కుమార్తె కనిపించటం లేదని, రెండు రోజుల క్రితం తన మనమరాలను తీసుకొని బయటకు వెళ్లిన తన కుమార్తె బయటకు రాలేదని, ఎన్నిచోట్ల వెతికిన ఆచూకీ లభించలేదని ఆమె తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశారని అన్నారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

టిడిపి జెండా దిమ్మ ధ్వంసం

ప్రజాశక్తి- పలాస



ధ్వంసం చేసిన టిడిపి జెండా దిమ్మ

పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలోని అంతరకుడ్డలో బుధవారం అర్ధరాత్రి సమయంలో టిడిపి జెండా దిమ్మను గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. విషయం తెలుసుకున్న టిడిపి నాయకులు దిమ్మ వద్దకు చేరుకుని పరిశీలించారు. ఈ విషయాన్ని మాజీ మంత్రి గౌతు శ్యామ్‌సుందర శివాజీ దృష్టికి తీసుకెళ్లారు. టిడిపి నాయకుల ఆదేశాల మేరకు ధ్వంసం చేసిన చోటే టిడిపి పట్టణ అధ్యక్షులు బడ్డ నాగరాజు జెండా దిమ్మను పున:నిర్మాణం చేపట్టారు. ఈ విషయంపై పోలీసులకు ఫిర్యాదు చేస్తామని అన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు జి.వైకుంఠరావు, ఎ.సురేష్, బి.శంకర్, ఎస్.శంకర్, ఎ.వెంకటరమణ, బి.మాధవరావు పాల్గొన్నారు.

ఒపిఎస్‌ను పునరుద్ధరించాలి

ఆమదాలవలస : పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని ఎపిసిపిఎస్ యూఎస్ జిల్లా అధ్యఓఉలు గురుగుబెల్లి భాస్కరరావు ఒక ప్రకటనలో ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. ప్రభుత్వం చెబుతున్న అంకెల గారడీ అశాస్త్రీయమైనదని అన్నారు. వచ్చే కాలానికి ఆదాయం పెరుగుతుందని, దానికనుగుణంగా ఖర్చులూ పెరుగుతాయని అన్నారు. ప్రభుత్వం కేవలం ఖర్చులు మాత్రమే గారడిగా చూపి ఆదాయాన్ని మింగేశారని అన్నారు. అన్ని సంఘాలనూ కలుపుకొని సంఘటితంగా ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

వేతనంతో కూడిన సెలవు మంజూరు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

జిల్లాలో ఈ నెల 19న జరగనున్న సర్పంచ్, వార్డు మెంబర్ల ఎన్నికలు సందర్భంగా కార్మికులకు వేతనంతో కూడిన సెలవు మంజూరు చేస్తున్నట్లు ఉప కార్మిక కమిషనర్ ప్రసాదరావు ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని దుకాణాలు, సంస్థల యజమానులకు ఈ మేరకు సమాచారం తెలియజేశామని అన్నారు. 19న బూర్జ, నందిగాం, సారవకోట, సరుబుజ్జిలి మండలాల్లోని కొన్ని పంచాయతీలకు సర్పంచ్, కొరసాం 4, డి.మత్స్యలేశం 6, జోనంకి 2, కోమర్తి 3, మాకివలస 2, కొత్తరేవు 1, గాతలవలస 6, గోకర్ణపల్లి 2, సంతబొమ్మాళి 12, తెలికిపెంట 10, నరసింగపల్లి 7, ఉగ్గుపురం 4 వార్డులకు ఎన్నికలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ ఆదేశాలను అనుసరించి ఈ సెలవును వర్తింపజేయాలన్నారు.



పనులను పరిశీలిస్తున్న ధర్మారావు

ముమ్మరంగా పారిశుధ్య పనులు

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

మండలంలోని పాతటెక్కలి పంచాయతీలో గురువారం పారిశుధ్య పనులు ముమ్మరంగా చేపడుతున్నారు. గ్రామంలోని పలుచోట్ల ప్రొక్లెయినర్‌తో పనులు చేపట్టి మురుగు కాలువలు శుభ్రం చేశారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు ఆనుకొని ఉన్న కాలువను శుభ్రం చేశారు. ముళ్ల చెట్లను, చెత్త చేదారాన్ని తొలగించారు. ఇటీవల చిన్నరామకృష్ణాపురం, మడేవానిపేట, లింగలపాడు గ్రామాల్లో 200 మీటర్ల సిమెంట్ రహదారి నిర్మాణం చేపట్టినట్లు సర్పంచ్ తుంగాన సుశీల, ప్రతినిధి ధర్మారావు తెలిపారు. పాఠశాల చుట్టూ ఉన్న తుప్పలను, పిచ్చి మొక్కలను తొలగింపు ప్రక్రియ ప్రధానోపాధ్యాయులు చంద్రశేఖరరావు, సర్పంచ్ ప్రతినిధి ధర్మారావుతో కలిసి పర్యవేక్షించారు.

నిధులు మంజూరు చేయాలని వినతి



వినతిపత్రం అందజేస్తున్న ప్రసాద్

కొత్తూరు : స్థానిక దళితపేటకుకు మంజూరు చేసిన సామాజిక భవనానికి హద్దులు చూపించిన నిధులు కేటాయించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు సిర్ల ప్రసాద్ కోరారు. ఈ మేరకు తహశీల్దార్ ఎం.చక్రవర్తిని గురువారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పేరుకుపోయిన దళిత సమస్యలను పరిష్కరించాలని అన్నారు. దీనిపై తహశీల్దార్ స్పందిస్తూ స్థలానికి హద్దులు చూపించి అప్పజెపుతామని హామీనిచ్చారు. దళిత సంఘ నాయకులు తొంపల తిరుపతిరావు, దుర్గశి దేవరాజు, గుడబండి సింహాచలం, వడమ శ్రీనివాసరావు, జవారాజు, బి.వసంతరవు, టి.మోహనరావు, టి.ప్రసాద్, ఎం.సుధాకర్, శేఖర్, గణేష్, రమేష్‌లు పాల్గొన్నారు.

కుట్టుమిషన్ల పంపిణీ

ఆమదాలవలస : మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించాలని న్యూ లైఫ్ ఎడ్యుకేషనల్ సొసైటీ, వెల్ఫేర్ అసోసియేషన్ సంస్థ డైరెక్టర్ కె.శ్యామ్ మాథ్యూస్ అన్నారు. పురపాలక సంఘ పరిధిలోని ఏడో వార్డు చింతాడలో ఉన్న న్యూ లైఫ్ హౌస్ ఆఫ్ ప్రేయర్ చర్చ్ ప్రాంగణంలో నడపబడుతున్న న్యూ లైఫ్ టైలరింగ్ శిక్షణా కేంద్రంలో శిక్షణ పొందిన మహిళలకు గురువారం కుట్టుమిషన్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మహిళలను చైతన్యవంతులుగా తీర్చిదిద్దడమే ఈ సంస్థ ముఖ్య ఉద్దేశమని అన్నారు. మహిళలు తమ కాళ్లపై తాము నిలబడి మహిళా స్వయం సాధికారిత సాధించాలన్నారు. ఆరు నెలలు పాటు టైలరింగ్ లో శిక్షణ పొందిన మహిళలకు ఆర్థికంగా చేయూతనందిస్తూ సంస్థ తరపున



కుట్టుమిషన్లను పంపిణీ చేస్తున్న శ్యామ్ మాథ్యూస్

కుట్టుమిషన్లను పంపిణీ చేస్తామని తెలిపారు. న్యూ లైఫ్ టైలరింగ్ సెంటర్ ప్రాజెక్టు డైరెక్టర్ పాస్టర్ జి.కృపావరం మాట్లాడుతూ మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా చైతన్యవంతులు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బోర చిన్నంనాయుడు, మున్సిపల్ మాజీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ అల్లంశెట్టి ఉమామహేశ్వరరావు, జె.కె.వెంకటేశ్వరరావు, బోర రమణయ్య, అబ్దుల్ ఖాన్ పాల్గొన్నారు.

మద్దతు ధర సాధించే వరకూ పోరాటం



సంతకాలను సేకరిస్తున్న కమిటీ సభ్యులు

వజ్రపుకొత్తూరు: జీడి పంటకు మద్దతు ధర సాధించే వరకూ పోరాటం ఆగదని జీడి పోరాట కమిటీ కన్వీనర్ తెప్పాల అజయ్ కుమార్ స్పష్టంచేశారు. జీడి మద్దతు ధర కోసం లక్ష సంతకాల సేకరణ కార్యక్రంలో భాగంగా గునుపల్లిలో వాసుపల్లి సాంబమూర్తి అధ్యక్షతన గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జీడి రైతుల సమస్యలు పరిష్కారానికి ప్రజలు నుంచి మద్దతు పెరుగుతుందన్నారు. ఈ సందర్భంగా రైతులు, యువకులు ప్రజలు నుంచి సంతకాలు సేకరించారు. కార్యక్రమంలో పల్లి గోపి, అంబటి ప్రవీణ్, హరి, లండ రాజేశ్వరి, ఎంపిటిసి కొండప్ప సురేఖ, లండ భోజరాజు, అంబటి రామకృష్ణ, కోడ రామన్న, కర్రీ ఉమాశంకర్, కుత్తుం వినోద్‌కుమార్, తమ్మినాన భాస్కర్, కె.బాలాజీ, కారి పురుషోత్తం, కోనేరు గురయ్య పాల్గొన్నారు.



కోటబొమ్మాళి పంచాయతీ కార్యాలయం

కోటబొమ్మాళి పంచాయతీలో నిధులు హాంఫట్!

కోటబొమ్మాళి: కోటబొమ్మాళి మేజరు పంచాయతీలో 2022-23 సంవత్సరానికి గాను పంచాయతీ నిధులు ఎటువంటి అనుమతులు లేకుండా రూ.40 లక్షలు కైంకర్యం చేసినట్లు తెలిసింది. వాటి ఖర్చులకు సంబందించి ఓచర్లు దస్త్రాలు ఆచూకీ లేవు. అయితే ఇటీవల పంచాయతీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ముసాయిద చదివిన ప్రాప్తికి ఈ విధులకు సంబంధించి ఏమి చేశారు, ఆ నిధులు దేనికి ఖర్చు చేశారు, ఏమయ్యాయని వార్డు మెంబరు ప్రశ్నించారు. దీంతో అందరూ తెల్లముఖం వేస్తూ అంతలోనే మాట దాటవేశారు. పంచాయతీ పరిధిలో రూ.32 లక్షలు ఇంటి పన్ను డిమాండ్ ఉండగా, ఇప్పటికే కొంతమేర వసూళ్లు చేసిన మొత్తమూ పంచాయతీ ఖాతాకు జమకాలేదు. ఇవి ఎవరి జోబుల్లోకి వెళ్లేయో అంతుచిక్కడం లేదు. పలు వ్యాపార సంస్థలకు రెండు, మూడు అంతస్తుల నిర్మాణానికి ఇబ్బడిముబ్బడిగా అనుమతులు జారీ చేసి వాటి ద్వారా వచ్చిన మొత్తం సైతం లెక్క తెలియకుండా, ఇటు జముకాకుండా ఉన్నాయి. అలాగే సర్పంచ్ ఖాతాకు సైతం సుమారు రూ.6 లక్షలు ఎటువంటి అనుమతులు లేకుండా జయ అయినట్లు తెలుస్తోంది. దర్యాప్తు నిర్వహించి తవ్వేకొద్దీ ఇంకెంత బయటపడుతుందోనని సర్వాత్రా చర్చనీయాంశమైంది. ఈ విషయమై ప్రస్తుత పంచాయతీ కార్యదర్శి సిహెచ్.సన్యాసికి వివరణ కోరగా, వీటికి సంబంధించిన దస్త్రాలు కనిపించడం లేదని, ఈ నిధులు విడుదల చేసినట్లు మాత్రమే వెబ్‌సైట్‌లో కనిపిస్తున్నాయని, జమలో ఖర్చులు నమోదు కాలేదని తెలిపారు.

వార్డు ఎన్నిక గుర్తులు తారుమారు

ప్రజాశక్తి- సంతబొమ్మాళి

సంతబొమ్మాళి మేజర్ పంచాయతీలో వార్డు మెంబరు ఎన్నిక గుర్తులను ఎన్నికల అధికారి తారుమారు చేశారు. వివరాల్లోకి వెళ్తే... పదో వార్డు రెయ్యి ఆనందరావు తన చెప్పిన వారికి అంగన్వాడీ కార్యకర్త పోస్టు ఇవ్వలేదని మనస్తాపానికి గురై వార్డు మెంబర్ పదవికి రాజీనామా చేశారు. ఖాళీ అయిన వార్డు మెంబరు పదవుకు ఉపఎన్నిక ప్రకటించారు. సదురు ఎన్నికకు నామినేషన్ ప్రక్రియ సోమవారంతో ముగిసింది. వార్డు రెయ్యిపేట నుంచి రెయ్యి బాలకృష్ణ, నగిరిపెంట నుంచి చమళ్ల అనసూయమ్మ. పోటీలో నిల్చొన్నారు. ఫార్మ్ - 9 ద్వారా వారికి గుర్తులు కేటాయిస్తూ మండల పరిషత్ కార్యాలయం నోటీసు బోర్డులో మంగళవారం అంటించారు. అనుసూయమ్మకు మంచం, బాలకృష్ణ కత్తెర గుర్తులు కేటాయించారు. దానికనుగుణంగా అభ్యర్థులు నమూనా బ్యాలెట్ పత్రాలను ముద్రించి ప్రచారం చేపట్టారు. గురువారం సాయంత్రంతో గడువు ముగిసింది. దీనికి సంతబొమ్మాళి మండలం పంచాయతీ విస్తరణధికారి హనుమంతు శశి భూషణరావు, ఎన్నికలు స్టేజ్-1 అధికారి అభ్యర్థులలకు ఫోన్ చేసి గుర్తులు అవి కావని, మార్చామని, నోటిస్ బోర్డులో చూసుకొండని తెలిపారు. ప్రచారం ముగిసిన తరువాత ఆ గుర్తులను ఎలా ప్రచారం చేయాలని, దీనిపై ఉన్నతాధికారులు స్పందించి సంబంధిత అధికారులపై తక్షణమే చర్యలు తీసుకొని అభ్యర్థులకు తగు న్యాయం చేయాలని కోరుతున్నారు. దీనిపై ఎంపిడిఒ సిహెచ్.ప్రేమలీలకు వివరణ కోరగా, శుక్ర వారం విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

కుంటుపడిన అభివృద్ధి

టిడిపి జిల్లా అధ్యక్షులు రవికుమార్

పొందూరు: తెలుగుదేశం పార్టీ పాలనతోనే రాష్ట్రంలో ప్రగతి సాధ్యమని టిడిపి జిల్లా అధ్యక్షులు కూన రవికుమార్ అన్నారు. మండలంలోని కృష్ణాపురంలో గురువారం నిర్వహించిన మహాశక్తి చైతన్యయాత్రలో పాల్గొని మాట్లాడారు. సిఎం జగన్ పాలనతో రాష్ట్రంలో విధ్వంసకర పాలన సాగుతున్నదే తప్ప అభివృద్ధి కుంటుపడిందని అన్నారు. ఒక్కఛాన్స్ అంటూ రాష్ట్రాన్ని అధోగతి పాలు చేశారని పేర్కొన్నారు. అనంతరం రానున్న ఎన్నికల్లో టిడిపి అధికారంలోకి రావడం



పోస్టర్‌ను అందజేస్తున్న రవికుమార్

ఖాయమని అన్నారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు చిగిలిపల్లి రామ్మోహన్, టిడిపి నాయకులు అన్నెపు రాము, చింతాడ కృష్ణవాసుదేవరావు, బలగ శంకరభాస్కరరావు, బాడాన శేషగిరినాయుడు, వండాన మురళి, పొన్నాడ రామారావు పాల్గొన్నారు.



శంకుస్థాపన చేస్తున్న తిలక్

గ్రామాల అభివృద్ధికి కృషి

ప్రజాశక్తి- నందిగాం

గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందని కళింగ కార్పొరేషన్ చైర్మన్ పేరాడ తిలక్ అన్నారు. మండలంలోని పెద్దలవునిపల్లి పంచాయతీ చిన్నలవునిపల్లి ఎస్‌సి కాలనీలో మండల పరిషత్ నిధులతో చేపట్టనున్న కమ్యూనిటీ షెల్టర్, తాగునీటి బోర్ నిర్మాణానికి ఎంపిపి నడుపూరు శ్రీరామ్మూర్తితో కలిసి గురువారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సిఎం జగన్మోహన్ రెడ్డి పేద కోసం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని అన్నారు. వీటిని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకుని ఆర్థికాభివృద్ధి సాధించాలన్నారు. కార్యక్రమంలో పిఎసిఎస్ అధ్యక్షులు కురమాన బాలకృష్ణారావు, మండల పరిషత్ ప్రత్యేక ఆహ్వానితులు చిన్ని జోగారావుయాదవ్, మండల పార్టీ అధ్యక్షుడు తమిరె ఫాల్గుణరావు, పెద్దలవునిపల్లి సర్పంచ్ అట్టాడ శ్రీనివాసరావు, ఎంపిటిసి పూడి ఆశారాణి, ఎంపిటిసి సభ్యులు రోణంకి ధర్మారావు, లవునిపల్లి ధనరాజ్, అంబోడి విష్ణు, సర్పంచ్‌లు బొమ్మాళి గున్నయ్య, తమిరి రాజు, కణితి నారాయణమూర్తి, తమిరి దేవేందరరావు పాల్గొన్నారు.


గ్రామస్తులతో మాట్లాడుతున్న మంత్రి అప్పలరాజు

గిరిజనులకు అండ

పశుసంవర్ధకశాఖ మంత్రి అప్పలరాజు

ప్రజాశక్తి- పలాస

గిరిజనులకు ప్రభుత్వం అండగా ఉంటుందని మత్స్య, పశుసంవర్ధకశాఖ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు అన్నారు. పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ మూడో వార్డు పరిధిలోని పెంటిభద్ర, జయరామచంద్రాపురం గ్రామాల్లో గురువారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు అందుతున్నాయా? లేవా? అని ఇంటింటికీ వెళ్లి ప్రజలకు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పెంటిభద్రలో రూ.5 లక్షల వ్యయంతో తాగునీరు కోసం పైపులైన్ నిర్మాణం చేపట్టామన్నారు. పాత పెంటిభద్రలో తాగునీటి సమస్య పరిష్కారానికి రూ. 5 లక్షలు నిధులు మంజూరు చేస్తున్నామని చెప్పారు. అలాగే జయరామచంద్రపురంలో సిసి రోడ్లు, కాలువ నిర్మాణంకు గడపగడప నిధులను వెచ్చించి త్వరలో పనులు పూర్తి చేస్తామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు, వైస్ చైర్మన్ మీసాల సురేష్‌బాబు, బొర కృష్ణారావు, ఎఎంసి చైర్మన్ పి.వి.సతీష్, మున్సిపల్ మాజీ చైర్మన్ కోత పూర్ణచంద్రరావు కమిషనర్ టి.నాగేంద్ర కుమార్, మున్సిపల్ డిఇ బల్ల హరి, ఎఇఇ అవినాష్ పాల్గొన్నారు.


వినతిపత్రం అందజేస్తున్న ఉద్యోగులు

బదిలీల ప్రక్రియను ప్రారంభించాలి

ప్రజాశక్తి- పలాస

రాష్ట్ర ప్రభుత్వం గత నెల చేపట్టిన సచివాలయ ఉద్యోగుల బదిలీ ప్రక్రియ చేపట్టిందని, అయినా కొన్ని శాఖల వారికి బదిలీ ప్రక్రియ మొదలు పెట్టలేదని, తక్షణమే ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డెమోక్రటిక్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల సంఘం విజయనగరం జిల్లా అధ్యక్షులు గురుగుబెల్లి కిరణ్‌కుమార్ కోరారు. కాశీబుగ్గలో మత్స్య, పశు సంవర్ధకశాఖ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజును గురువారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అగ్రికల్చర్, ఫిషరీస్, పశుసంవర్ధకశాఖ, ఉద్యానవనశాఖ, సెరీకల్చర్ శాఖలకు చెందిన ఉద్యోగులకు రేషనలైజేషన్ అనే కారణంతో బదిలీలు నిలుపుదల చేశారని అన్నారు. వీలైంత త్వరగా ఆ ప్రక్రియను ముగించి బదిలీలు చేప్టాలని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో యూనియన్ సభ్యులు ఎం.లక్ష్మణరావు, కె.శ్రీను, బి.సంధ్య, కె.లక్ష్మణరావు ఉన్నారు.


కుళాయిని ప్రారంభిస్తున్న నాయకులు

మౌలిక వసతుల కల్పనే ధ్యేయం

జలుమూరు: ప్రజలకు మౌలిక వసతుల కల్పన ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తుందని పోలాకి జెడ్‌పిటిసి ధర్మాన కృష్ణ చైతన్య, ఎంపిపి వాన గోపి అన్నారు. మండలంలోని శ్రీముఖలింగంలో రూ.21.30 లక్షలతో చేపట్టనున్న ఇంటింటికీ తాగునీటి కుళాయి పనులను గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో నివసించే ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు ప్రతి ఇంటికీ అందించడమే లక్ష్యంగా కుళాయిలు ఏర్పాటు చేశామని అన్నారు. వైసిపి మండల అధ్యక్షుడు కనుసు సీతారాం, జెసిఎస్ కన్వీనర్ ధర్మాన జగన్మోహనరావు, వైస్ ఎంపిపి తంగి మురళీకృష్ణ, సర్పంచ్ టి.సతీష్‌కుమార్, ఎంపిటిసి కరుకోల హరిప్రసాద్, వైసిపి నాయకులు బసవ వెంకటరమణ, ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ చైతన్యకుమార్ పాల్గొన్నారు.


శ్రీకాంత్‌ను సన్మానిస్తున్న నాయకులు

మెళియాపుట్టిలో శ్రీకాంత్ పర్యటన

మెళియాపుటి : మండలంలోని చీపురుపల్లి, పరశురాంపురం గ్రామాల్లో తూర్పుకాపు కార్పొరేషన్ చైర్మన్ మామిడి శ్రీకాంత్ గురువారం పర్యటించారు. చీపురుపల్లి సర్పంచ్ యవ్వరి ఈశ్వరరావు, చాపర నారాయణరావు, సోమేశ్వరరావును మర్యాదగా పూర్వకంగా కలుసుకున్నారు. పరశురాంపురం సచివాలయంలో పనిచేస్తున్న వ్యవసాయ క్షేత్ర సహాయకులు దుక్క శరత్‌కుమార్ రెడ్డికి ఉత్తమ అవార్డు రావడంతో ఆయనను ఘనంగా సన్మానించారు. అంతకుముందు వైస్ ఎంపిపి ఎస్.ఆదినారాయణ ఆధ్వర్యాన శ్రీకాంత్‌ను సన్మానించారు. కార్యక్రమంలో ఎంపిపి ప్రతినిది పాడి అప్పారావు, ఎఎంసి మాజీ చైర్మన్ రాజశేఖరరెడ్డి, సర్పంచ్‌లు పెద్దింటి చంద్రరావు, సిద్ధిపాలెం గౌరీస్, సవర రంగారావు, బోసి రామారావు, యవ్వరి ఈశ్వరరావు, జనపరెడ్డి కన్నబాబు, రవీంద్ర జన్న, ఉర్లన రుషి, జన్ని రామకృష్ణ పాల్గొన్నారు.

బీటలు వారుతున్న వరి పొలాలు

వీరఘట్టం : తోటపల్లి ప్రధాన ఎడమ కాలువ ఎగువ ప్రాంత భూములకు సకాలంలో వర్షాలు పడకపోవడంతో సాగునీరు లేక పంట భూములు బీటలు వారుతున్నాయి. వేలాది రూపాయలు పెట్టుబడులు పెట్టి పంటల సాగు చేసినప్పటికీ వర్షాలు పడకపోవడంతో అన్నదాత ఆకాశం వైపు ఆశగా ఎదురు చూస్తున్నారు. గతేడాది కూడా సకాలంలో వర్షాలు కురవక పంటపై పెట్టిన పెట్టుబడులు రాక అప్పుల్లో కూరుకు పోయామని ఈ ఏడాదైనా పంటలు బాగా పండితే కొంతమేరైనా అప్పులు తీరితాయని ఆశతో పంటలు సాగు చేస్తున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కొట్టుగుమ్మడలో ఫ్యామిలీ డాక్టర్

వీరఘట్టం :మండలంలోని కొట్టుగుమ్మడ గ్రామంలో గురువారం 104 ఆధ్వర్యంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి పి ఉమామహేశ్వరి వివిధ రకాల రోగులకు తనిఖీలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ నయామి, ఎంఎల్‌హెచ్‌పి ఆశ, ఏఎన్ఎం రాజేశ్వరి, ఆశా కార్యకర్తలు, 104 సిబ్బంది పాల్గొన్నారు.

ప్రారంభానికి సిద్ధంగా సచివాలయం

వీరఘట్టం: మండలంలోని వండువ గ్రామ సచివాలయం ప్రారంభానికి సిద్ధంగా ఉంది. ఉపాధి హామీ చట్టం సుమారు రూ.40 లక్షల అంచనా వ్యయం నిర్మాణ పనులు చేపట్టారు. దాదాపుగా సచివాలయ భవన నిర్మాణ పనులు అన్ని హంగులతో పూర్తిచేసి ప్రారంభించేందుకు సిద్ధంగా ఉంది. భవన సదుపాయం లేకపోవడంతో ప్రస్తుతం ఇరికైనా భవనంలో సచివాలయ ఉద్యోగులు విధులు నిర్వహిస్తున్నారు.

300 మంది యువకులతో పట్టణ భద్రత

కాశీబుగ్గ సిఐ శ్రీనివాసరావు

ప్రజాశక్తి- పలాస

పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలో శాంతిభద్రతలు, దొంగతనం, ట్రాఫిక్, నేరాల అదుపు, అతి వేగం నియంత్రణకు 300 మంది యువకులతో పట్టణ భద్రతకు సమాంతర పోలీసు వ్యవస్థ ఏర్పాటు చేస్తున్నామని కాశీబుగ్గ సిఐ శ్రీనివాసరావు అన్నారు. పలాస-మున్సిపల్ కార్యాలయంలో చైర్మన్ బల్ల గిరిబాబు అధ్యక్షతన కౌన్సిలర్లతో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మున్సిపాలిటీ పరిధిలో 31 వార్డులు ఉన్నాయని, ప్రతి కౌన్సిలర్ తమ పరిధిలో చురుకైన విద్యావంతులు, నేర ప్రవృత్తి లేని వారిని గుర్తించి పది మంది చొప్పున మున్సిపాలిటీలో 300 మంది యువకులతో సమాంతర పోలీసు వ్యవస్థ ఏర్పాటు చేయనున్నమని అన్నారు. వీరికి ప్రత్యేక శిక్షణతో పాటు సలహాలు సూచనలు అందజేస్తామని అన్నారు. అనంతరం వీరి సేవలను ఉపయోగించుకుంటామని చెప్పారు. రాత్రి సమయాల్లో పోలీసులతో యువకులను బీట్లకు పంపిస్తామన్నారు. మున్సిపాలిటీ మారుమూల ప్రాంతాల్లో ఎటువంటి అసంఘిక చర్యలు జరగకుండా వీరి ద్వారా నియంత్రిస్తామని అన్నారు. ప్రతి కౌన్సిలర్ తమ వార్డు పరిధిలో సిసి కెమెరాలు ఏర్పాటు కోసం సహాయ సహకారాలు అందించాలన్నారు. జంట పట్టణాల్లో సుమారు 100 సిసి కెమెరాలు ఏర్పాటు చేసి కమాండ్ కంట్రోల్ చేసేందుకు మున్సిపాలిటీ అధికారులు కౌన్సిలర్లు సహకరించాలని కోరారు. సమావేశంలో కమిషనర్ టి.నాగేంద్ర కుమార్, వైస్ చైర్మన్లు మీసాల సురేష్ బాబు, బోర కృష్ణారావు, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సిఐ శ్రీనివాసరావు

పాలనలో సత్ఫలితాలు

రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు

ప్రజాశక్తి - శ్రీకాకుళం


మాట్లాడుతున్న ధర్మాన ప్రసాదరావు

ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి విశాల దృక్పథం కారణంగానే రాష్ట్రంలో పాలనా పరంగా సత్ఫలితాలు వస్తున్నారని రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. నగరంలోని ఒక ఫంక్షన్ హాల్‌లో జెసిఎస్ నమోదు కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్నది ఎన్నికల యుద్ధ కాలమని, ఇందులో ప్రతిఒక్కరూ తప్పక పాల్గొనాలన్నారు. నాయకులంతా దిగువ శ్రేణులను కలుపుకొని వెళ్లాలని సూచించారు. ప్రతిపక్షాలు ప్రభుత్వంపై అవాస్తవాలు ప్రచారం చేస్తున్నాయని దుయ్యబట్టారు. కరోనా సమయంలో వైసిపి ప్రభుత్వం చేసిన విధంగా ఇతర ఏ ప్రభుత్వాలూ చేయలేదన్నారు. గెలుపే ధ్యేయంగా పనిచేసేందుకు సన్నద్ధం కావాలని శ్రేణులకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వైసిపి జిల్లా అధ్యక్షులు ధర్మాన కృష్ణదాస్, కార్పొరేషన్ల చైర్మన్లు అంధవరపు సూరిబాబు, మామిడి శ్రీకాంత్, జిల్లా రైతువిభాగం అధ్యక్షులు అంబటి శ్రీనివాసరావు, డిసిఎంఎస్ చైర్మన్ గొండు రఘురాం, ఎఎంసి చైర్మన్ మూకళ్ల తాతబాబు, జిల్లా యువజన విభాగం అధ్యక్షులు మెంటాడ స్వరూప్, పట్టణ అధ్యక్షులు సాధు వైకుంఠరావు తదితరులు పాల్గొన్నారు.

శివారు ప్రాంతాలకు సాగునీరు అందించాలి

ప్రజాశక్తి- ఆమదాలవలస

మండలంలో నారాయణపురం హైలెవెల్ ఛానల్ నుంచి వస్తున్న కొత్తగడ్డ ద్వారా శివారు ప్రాంతాలకు సాగునీరు అందించాలని కొర్లకోట సర్పంచ్ ప్రతినిధి సనపల అప్పలనాయుడు, ఎంపిటిసి అన్నెపు భాస్కరరావు కోరారు. ఈ మేరకు రైతులు 16 కిలోమీటర్లు కొత్తగడ్డ వెంబడి గురువారం పర్యటించి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. కాలువలో పేరుకుపోయిన చెత్తా చెదారాలను తొలగించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గుత్తావల్లి-కాళపర్తి రోడ్డు నుంచి ఓ.వి.పేట వరకు తూతిక బడ్డు, కలుపు విపరీతంగా ఉండటంతో సాగునీరు కిందికు రావడం లేదని, తక్షణమే ఇరిగేషన్ అధికారులు తొలగించాలని కోరారు. వర్షాభావ పరిస్థితుల వల్ల పైన ఉన్న రైతులు సుమారు 50 నీటి ఇంజిన్లతో ఆయకట్టు లేని పొలాలకు నీరును తోడేస్తున్నారని అన్నారు. గడ్డ కళాసులు లేనందున దీనిని అరికట్టలేకపోతున్నారని వాపోయారు. వీరితో పాటు రైతులు పేడాడ రామచంద్రరావు, అన్నెపు చిరంజీవి, పేడాడ గురువునాయుడు, సువారి అప్పన్న, చిగురుపల్లి అన్నాజీరావు ఉన్నారు.


చెత్తా చెదారాన్ని తొలగిస్తున్న రైతులు

ఆన్‌లైన్ మోసాలపై అప్రమత్తం



అవగాహన కల్పిస్తున్న శంకరరావు

ప్రజాశక్తి- ఆమదాలవలస

ఆన్‌లైన్ మోసాలపై ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని కళాజాతా బృందం కె.శంకరరావు, కె.సత్యనారాయణ, ఎం.లక్ష్మి సూచించారు. పురపాలక సంఘంలోని ఒకటో వార్డు పరిధిలో ఉన్న జగ్గుశాస్త్రులపేటలో ఆర్‌బిఐ పథకంలో భాగంగా యూనియన్ బ్యాంకు సౌజన్యంతో ఎస్ఎస్‌టి స్వచ్ఛంద సంస్థ నిర్వహణలో ఆర్థిక అక్షరాస్యతపై ప్రజలకు గురువారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఫలానా బ్యాంకు నుంచి మాట్లాడుతున్నామని, ఎవరైనా ఫోన్ చేసి అకౌంట్ వివరాలను అడిగితే అటువంటి వారికి సమాచారం ఇవ్వవద్దని సూచించారు. బ్యాంకులు ఎప్పుడు ఖాతాదారుల వివరాలను ఫోన్ చేసి తెలుసుకోవని తెలిపారు. ఎటిఎంలో అపరిచితులకు కార్డును ఇచ్చి డబ్బులు విత్ డ్రా చేసి పెట్టమని కోరరాదని తెలిపారు. రూపే ఎటిఎం కార్డుల ప్రయోజనాలను ప్రజలకు వివరించారు. సైబర్ మోసాలకు గురైనప్పుడు 1930, ఇంటిగ్రేటెడ్ అంబుడ్స్‌మెన్ 14448 టోల్ ఫ్రీ నంబర్లకు ఫోన్ చేసి ఫిర్యాదు చేయవచ్చునని తెలిపారు. కార్యక్రమంలో వాలంటీర్ పవన్, ఎస్ఎఫ్ఎల్ కో-ఆర్డినేటర్లు చిగురుపల్లి వెంకటేష్, రామారావు పాల్గొన్నారు.

గుర్రపుడెక్క తొలగింపునకు చర్యలు

సంతబొమ్మాళి : మండలంలోని బోరుభద్ర, మలగాంలో ప్రవహించే వంశధార కాలువలో పేరుకుపోయిన గుర్రపుడెక్కను తొలగింపునకు చర్యలు చేపట్టామని జెడ్‌పిటిసి పాల వసంతరెడ్డి అన్నారు. ఈ మేరకు ప్రొక్లెయినర్‌తో చేపట్టనున్న పనులకు గురువారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్, నియోజకవర్గ ఇన్‌ఛార్జి దువ్వాడ వాణి సహాయ సహకారాలతో పనులు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో మలగాం సర్పంచ్ ప్రతినిధి సూరాడ వెంకటేష్, మేఘవరం ఎంపిటిసి సూరాడ రాజారావు, సచివాలయ కన్వీనర్ మోడీ భాస్కరరెడ్డి, కొల్లిపాడు సర్పంచ్ ప్రతినిధి గొరుసు సవరయ్య, పాలతలగాం సర్పంచ్ ప్రతినిధి నక్కిట్ల నరేష్, ఎంపిటిసి ప్రతినిధి అట్టాడ అప్పలనాయుడు, తిప్పాన రమణ, వై.జానికరావు, వంశధార జెఇ అప్పలరెడ్డి పాల్గొన్నారు.


పనులను ప్రారంభిస్తున్న వసంతరెడ్డి

పంట నమోదు తప్పనిసరి


గోవిందరావు, ఎఒ

కోటబొమ్మాళి: మండలంలోని ఖరీఫ్ 2023కు సంబంధించిన పంట నమోదు కార్యక్రమం వ్యవసాయశాఖ చేపట్టిందని, రైతులందరూ పంట నమోదు చేసుకోవాలని మండల ఎఒ ఎస్.గోవిందరావు తెలిపారు. తన కార్యాలయంలో గురువారం విలేకరులతో మాట్లాడారు. పంటల బీమా వర్తించాలంటే గతంలో పంటకోత ప్రయోగాలను మాత్రమే ప్రాతిపదికన తీసుకునే వారని, కానీ, ఈ సీజన్ నుంచి శాటిలైట్ ఫొటోల ద్వారా సరిచూసి దాని ప్రకారంగా పంటల బీమాను వర్తింపచేయడానికి సన్నాహాలు చేపడుతున్నామని అన్నారు. ఈ నేపథ్యంలో ప్రతి సర్వే నంబరూ జియో టాగింగ్ చేయడం ద్వారా మాత్రమే అక్కడ పంట నమోదు పూర్తవుతుందని తెలిపారు. ఈ పంట నమోదు పూర్తయిన తర్వాత ఇకెవైసి కూడా తప్పనిసరిగా చేయించుకోవాలని అన్నారు. అప్పుడు మాత్రమే పంట నమోదు ప్రక్రియ పూర్తయినట్లుగా వస్తుందని అన్నారు. అనంతరం పంటలను ప్రభుత్వ మద్దతు ధరకు అమ్మడానికైనా, పంట నష్టాలు పొందడా నికైనా, పంటల బీమా పొందడానికైనా, పంట రుణాలు తీసుకోవడానికి, సున్నా వడ్డీ పథకం కింద లబ్ధిపొంద డానికీ ఈ పంట నమోదును ప్రామాణికంగా తీసుకుంటున్నారు. వచ్చే నెల 15లోగా నమోదు చేసుకోవాలన్నారు.

ఉపకార వేతనాల పంపిణీ

ప్రజాశక్తి- ఆమదాలవలస

కెనరా విద్యా జ్యోతి పథకంలో ఆరు నుంచి పదో తరగతి వరకు చదువుతున్న అత్యధిక మార్కులు సాధించిన షెడ్యూల్ తరగతులకు చెందిన విద్యార్థిర్థులకు స్కాలర్ షిప్‌లను అందజేశారు. పట్టణంలోని లక్ష్మీనగర్ మున్సిపల్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న 6, 7, 8 తరగతి విద్యార్థులకు ఒక్కొక్కరికీ రూ.2,500 చొప్పున, 9, 10 తరగతి విద్యార్థులకు రూ.5 వేలు చొప్పున మొత్తం రూ.22,500 స్కాలర్‌షిప్‌లను బ్యాంకు మేనేజర్ ఆకాంక్ష వర్మ, కొప్పల చక్రధర్ గురువారం అందజేశారు. సంబంధిత చెక్కును హెచ్ఎంకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ స్కాలర్‌షిప్‌లతో విద్యార్థులు చదువుకునేందుకు అవసరమైన పుస్తకాలు, సామగ్రి కొనుగోలు చేసుకుని ఉన్నత చదువుల్లో రాణించాల న్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు బొడ్డేపల్లి రామకృష్ణ, ఉపాధ్యాయులు ఇంద్రాక్షిణి, కెనరా బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.


చెక్కును అందజేస్తున్న మేనేజర్ ఆకాంక్షవర్మ

రేపు ఉచిత నేత్ర వైద్య శిబిరం

టెక్కలి : టెక్కలి సబ్‌ట్రెజరీ పరిధిలోని విశ్రాంత ఉద్యోగులకు శనివారం ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షులు రోణంకి రామచంద్రరావు ఒక ప్రకటనలో తెలిపారు. విజయనగరానికి చెందిన వెంకటేశ్వర పుష్పగిరి కంటి ఆస్పత్రి సౌజన్యంతో ఈ శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆరోగ్య కార్డులు ఉన్న వారు హాజరుకావాలన్నారు.

డిసిహెచ్ఒ విచారణ

పొందూరు: పొందూరు ప్రభుత్వ సామాజిక ఆస్పత్రిలో బుధవారం ఎంపిడిఒ తనిఖీ చేసిన సమయంలో వైద్యులు లేకపోవడంపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో డిసిహెచ్ఒ జె.భాస్కరరావు గురువారం విచారణ చేపట్టారు. దీనిపై ఆస్పత్రి సూపరింటెండెంట్ రామదాసు కోర్టు విధుల్లో ఉన్నారని, మరొకరు ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమానికి హాజరు కాగా, మరో ఇద్దరు సెలవులో ఉన్నట్లు గుర్తించామని డిసిహెచ్ఒ తెలిపారు. దీనిపై ఉన్నతాధికారులకు నివేదికను అందజేస్తానని తెలిపారు.


సన్మానిస్తున్న కార్మికులు

రైల్వే కార్మికుల సమస్యలు పరిష్కరిస్తా

పలాస : రైల్వే కార్మికుల సమస్యలు పరిష్కరించడంలో తమ సంఘం ముందంజలో ఉంటుందని ఈస్ట్‌కోస్ట్ రైల్వే శ్రామిక కాంగ్రెస్ జనరల్ సెక్రటరీ రమేష్ చంద్రసాహు అన్నారు. పలాస రైల్వే శ్రామిక్ కాంగ్రెస్ కార్యాలయంలో గురువారం కార్మికులతో సమావేశం నిర్వహించారు. ముందుగా కార్మికులు ఘనస్వాగతం పలికారు. అనంతరం రైల్వే అతిథి గృహంలో విలేకరులతో మాట్లాడారు. పాత పెన్షన్ విధానం అమలు, రైల్వేశాఖలో కొత్తగా ఉద్యోగాలు, కాంట్రాక్టు ఉద్యోగుల రెగ్యులర్ అంశాలను త్వరలో పరిష్కారానికి కృషి చేస్తామని అన్నారు. కార్యక్రమంలో కార్మిక సంఘం నాయకులు శిర రాజశేఖర్, చల్లా రమేష్, మారనపల్లి నాగభూషణరావు, కమ్మినేని హరి, శ్రీనివాసరావు, వి.రామారావు, ఆర్.వి.రావు, రవిచౌదరి పాల్గొన్నారు.

20 ఎకరాల్లో 'కేడర్ కాంపాక్ట్ బ్లాక్'

ఆమదాలవలస : మండలంలోని చేపేనపేట యూనిట్‌లో ప్రకృతి వ్యవసాయాన్ని రైతులు ఎంతో ఉత్సాహంతో సాగుచేస్తున్నారు. ఇందులో భాగంగా నక్క చిరంజీవి మాట్లాడుతూ చేపేనపేటలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది సురేష్ సాగు చేస్తున్న పొలం చుట్టూ ఇరవై యకరాల విస్తీర్ణంలో పూర్తిగా వరి పంటలో రాజీలేని సూత్రాలు పాటిస్తూ సాగు చేస్తున్నారని అన్నారు. అలాగే గ్రామంలో మిగతా రైతులతో కూడా తప్పకుండా పూర్తి విస్తీర్ణంలో ప్రకృతి వ్యవసాయం సాగాయ్యేల సిబ్బంది క్షేత్ర స్థాయిలో పనిచేస్తున్నారని తెలిపారు.

విస్తృతంగా పథకాల ప్రచారం

టెక్కలి రూరల్ : ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లో విస్తృతంగా ప్రచారం చేయాలని, వచ్చే ఎన్నికల్లో టెక్కలి నియోజకవర్గం నుంచి వైసిపి బలపర్చి అభ్యర్థి విజయానికి కార్యకర్తలు కృషి చేయాలని నియోజకవర్గ పరిశీలకులు, ఎపి మారిటైమ్ బోర్డు చైర్మన్ కాయల వెంకటరెడ్డి పిలుపు నిచ్చారు. స్థానిక ఎస్ కన్వెన్షన్ హాల్‌లో సచివాలయం కన్వీనర్లతో గురువారం సమావేశం నిర్వహించారు. సమన్వయకర్త దువ్వాడ వాణి, సంతబొమ్మాళి జెడ్‌పిటిసి పాల వసంతరెడ్డి, టెక్కలి ఎంపిపి ఆట్ల సరోజినమ్మ, సంతబొమ్మాళి ఎంపిపి ప్రతినిధి మేరుగా అప్పారావు, కోత సతీష్, చింతాడ గణపతి, సత్తారు ఉషారాణి, జయరాం పాల్గొన్నారు.

ప్రచారాలను నమ్మొద్దు

ఇచ్ఛాపురం : సామాజిక మాధ్యమాల్లో పత్రికల్లో వస్తున్న కథనాలు అవాస్తవాలను ఎవరూ నమ్మొద్దని రెడ్డిక కార్పొరేషన్ చైర్మన్ దుక్క లోకేశ్వరరావు అన్నారు. ఈ మేరకు మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో రెడ్డిలతో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రెడ్డిక సామాజిక తరగతికి సిఎం జగన్ పెద్దపీట వేస్తున్నారని అన్నారు. సమావేశంలో ఎంపిపి బోర పుష్ప, జెడ్‌పిటిసి ఉప్పాడ నారాయణమ్మ, కె.మోహనరావు, పిట్ట మామయ్య, ఆసి పురుషోత్తంరెడ్డి, దీనబంధురెడ్డి, దక్కత నూకయ్యరెడ్డి, చిట్టిబాబు, కె.త్రినాథ్, జయదేవ్ పాల్గొన్నారు.


అవగాహన కల్పిస్తున్న ఎఒ మోహనరావు

'పొలంబడి'తో అవగాహన

ప్రజాశక్తి- ఆమదాలవలస

పొలంబడి శిక్షణా కార్యక్రమం వల్ల రైతులకు సరైన అవగాహనతో ఎంతో మేలుచేకూరుతుందని మండల ఎఒ మెట్ట మోహనరావు అన్నారు. మండలంలోని దూసిలో డాక్టర్ వైఎస్ఆర్ పొలంబడి కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. వరి పంట మొక్కల గణాంక, ప్రస్తుత పంట పర్యావరణ విశ్లేషణను పరిశీలించారు. వరి పంటలో కలుపు యాజమాన్యం, మొదటిసారి ఎరువుల యాజమాన్యం గురించి రైతులకు వివరించారు. వాతావరణ మార్పులు వల్ల రాబోయే చీడపీడల యాజమాన్యం గురించి రైతులకు వివరించారు. రైతులకు విత్తన శుద్ధి, అంతర పంటలు, రొట్టె ఎరువుల ప్రాముఖ్యతను రైతులకు వివరించారు. పంట వేసిన ప్రతి రైతూ ఈ-క్రాప్ నమోదు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో విలేజ్ అగ్రికల్చరల్ అసిస్టెంట్ టి.అలేఖ్య పాల్గొన్నారు.


వినతిపత్రం అందజేస్తున్న సూర్యం

వసతిగృహంలో సీట్లు కేటాయించాలి

టెక్కలి : టెక్కలి బిసి బాలికల వసతిగృహంలో అర్హత కలిగిన విద్యార్థినులకు సీట్లు కేటాయించాలని నిరుద్యోగ పోరాట సమితి జిల్లా అధ్యక్షులు తలసముద్రం సూర్యం కోరారు. ఈ మేరకు సబ్ కలెక్టర్ కార్యాలయ ఎఒ రాజమోహన్‌ను గురువారం కలిసి వినతిపత్రం అందజేశారు. టెక్కలిలోని పలు ప్రభుత్వ, ప్రయివేట్ డిగ్రీ కళాశాలల్లో చదువుకోవాలనుకునే ఆసక్తి గల విద్యార్థులు టెక్కలి వస్తున్నారని అన్నారు. కానీ, వారికి వసతిగృహంలో సీట్లు లభించకపోవడంతో చదువుకు దూరమవుతున్నారని అన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి సీట్లు కేటాయించాలని కోరారు.

బొనమాలి పాఠశాలను పునరుద్ధరించాలి


వినతిపత్రం అందజేస్తున్న శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి

ఇచ్ఛాపురం : ఇచ్ఛాపురం నియోజవర్గం కంచిలి మండలం బొనమాలి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను పునరుద్ధరించాలని సీడాప్ ఎపి చైర్మన్ డి.శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి కోరారు. ఈ మేరకు విజయవాడలోని స్కూల్ ఎడ్యుకేషన్ కమిషనర్ సురేష్‌కుమార్‌ను గురువారం కలిపి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విలీనం పేరుతో ఈ పాఠశాలను మూసివేశారని అన్నారు. గ్రామంలో 40 మంది ద్యార్థులు పక్క గ్రామమైన జెన్నాగాయి స్కూల్‌లో వెళ్లి విద్యను అభ్యసిస్తున్నారని అన్నారు. జెన్నాగాయి వెళ్లే రోడ్డుకు ఆనుకుని చెరువుతు ఉన్నాయని, రాకపోకలు సాగించేందుకు విద్యార్థులు అవస్థలు పడుతున్నారని అన్నారు. విలీనంతో నిరక్షరాస్యులుగా, బాల కార్మికులుగా మిగిలిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

సిఎంకు కృతజ్ఞతలు

పోలాకి: రాష్ట్రంలో జూనియర్ కళాశాలలో కాంట్రాక్టు లెక్చరర్లుగా విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులను సిఎం జగన్మోహన్‌రెడ్డి రెగ్యులర్ చేసేందుకు ఫైల్‌పై సంతకం చేసినందుకు ఎస్‌సి, ఎస్‌టి లెక్చరర్ల సంఘం జిల్లా అధ్యక్షులు ఆర్.త్రినాథరావు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పోలాకి జూనియర్ కళాశాలలో గురువారం విలేకరులతో మాట్లాడారు. సిఎం ఇచ్చిన మాటను నిలబెట్టికొని రెగ్యులర్ చేయడం ఆనందంగా ఉందన్నారు.

టిడిపి పూర్వవైభవానికి కృషి

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

ప్రతి నియోజకవర్గంలోని టిడిపి కార్యకర్తలు, నాయకులు సమన్వయంతో పనిచేసి పూర్వ వైభవానికి కృషి చేయాలని శ్రీకాకుళం నియోజకవర్గ పరిశీలకులు, టిడిపి రాష్ట్ర కార్యదర్శి చింతల రామకృష్ణ అన్నారు. నగరంలోని జిల్లా టిడిపి కార్యాలయంలో నియోజకర్గ సమన్వయ కమిటీ సమావేశం గురువారం నిర్వహించారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి, నగర అధ్యక్షులు మాదారపు వెంకటేష్, మండల పార్టీ అధ్యక్షులు, క్లస్టర్ యూనిట్ ఇన్‌ఛార్జి నాయకులు పాల్గొన్నారు.

వృద్ధురాలికి ఆర్థికసాయం

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

నగరంలోని తిలక్ నగర్‌లో నివాసముంటున్న వృద్ధురాలికి స్వచ్ఛంద సంస్థలు చేయూత నిచ్చాయి. తక్షణ సాయంగా 25 కేజీల బియ్యం, రెండు నెలలకు సరిపోయే నిత్యవసర సరుకులు, నగదును జిల్ ఫౌండేషన్ సత్య సాయి, జాడ సాయిలు గురువారం అందజేశారు. తన స్వస్థలం శ్రీకూర్మం అని, ఆర్థికంగా ఆసరా లేక నగరంలో భోజనం కోసం ఎదురు చూస్తున్నానని ఆమె తెలిపారు. కార్యక్రమంలో శాసపు జోగినాయుడు, శివతేజ, సిక్కోలు స్వచ్ఛంద సేవ సమితి రమేష్, మదర్స్ లవ్ ప్రెసిడెంట్ సుప్రజ రౌత్, లయన్స్ బ్లడ్ బ్యాంకు మేనేజర్ కొంతం సునీల్, పొడుగు చరణ్, మధు పాల్గొన్నారు.

ఎరుకులకు ఎస్‌టి సర్టిఫికెట్ ఇవ్వాలి

ప్రజాశక్తి -గుమ్మలక్ష్మీపురం

జియమ్మవలస మండలం తురకనాయుడువలసలో నివాసముంటున్న ఎరుకల కులస్తులకు ఎస్టీ కుల ధ్రువీకరణ పత్రం మంజూరు చేయాలని స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కోరంగి సీతారాం మాట్లాడుతూ తురకనాయుడువలసలో ఎరుకల కులస్తులకు అనేక ఏళ్ల నుండి ఎస్టీ కుల ధ్రువీకరణ పత్రం ఇస్తున్నప్పటికీ తురకనాయుడువలస గ్రామ రెవెన్యూ అధికారి గ్రామ పెద్దలు ఇవ్వొద్దన్నారని అందుకే ఇవ్వడం లేదని బాధ్యతారహితంగా చెబుతున్నారని అన్నారు. ఎరుకల కులస్తులకు ఎస్టీ కులధ్రువీకరణ పత్రం మంజూరు చేయకపోవడం వల్ల వారి పిల్లలు సుమారు 30మంది ఐదో తరగతి వరకు చదివి మధ్యలోనే చదువులు నిలిపివేసే పరిస్థితి ఉందన్నారు. వారి భవితవ్యం ప్రశ్నార్థకంగా మారనున్నది కాబట్టి వెంటనే తహశీల్దార్ చొరవచేసి తురకనాయుడువలసలో గల ఎరుకల కులస్తుల సర్టిఫికెట్లు విచారణ చేసి వారికి ఎస్టీ కుల ధ్రువీకరణ పత్రం మంజూరు చేయాలని లేకపోతే భవిష్యత్తులో వీరందరినీ పార్వతీపురం జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా చేయాల్సి వస్తుందని అన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కొల్లి గంగు నాయుడు పాల్గొన్నారు.


నిరసన తెలుపుతున్న ఆదివాసీ గిరిజన సంఘు సభ్యులు